2015 జనవరి

# పరిశుద్ధత

ఆధ్యాత్మిక క్రైస్తవ మాసపత్రిక

ప్రధాన సంపాదకులు :

**రెవ.డా॥ కె. జోసఫ్**

సర్క్యులేషన్ :

**సామ్రాట్ కొడవటికంటి**

**చందా వివరములు :**

సంవత్సర చందా రూ. 150/-

పోషక చందా రూ. 1000/-

జీవిత చందా రూ. 3000/-

విడి ప్రతి రూ. 15/-


**మా చిరునామా :**

ఎడిటర్

పరిశుద్ధత

పోస్‌బాక్స్ నెం. 28

ఒంగోలు - 523001

ఫోన్ : 08592-231281


## లోపలి పేజీల్లో...


| | | |
|---|---|---|
| సంపాదకీయం | ఎడిటర్ | 02 |
| అపొస్తలుడు | కొడవటికంటి | 03 |
| లియో టాల్‌స్టాయ్ | ఐ.ఇ.ఆర్.యఫ్. డెస్క్ | 06 |
| దైవశక్తి | మామయ్య కథలు<br>ఐ.ఇ.ఆర్.యఫ్. డెస్క్ | 09 |
| క్రొత్తసంవత్సరం | రెవ.డా॥కె. జోసఫ్ | 10 |
| సుబుద్ధి | శ్రీమతి రేచల్ జోసఫ్ | 12 |
| ఆత్మలు-క్రియలు | ఎ. మత్తయి, వినుకొండ | 13 |
| దుఃఖ దినములు సమాప్తమాయెను | శ్రీమతి మాధురిమరియన్ | 16 |
| ఆఖరి తిరుగుబాటు | బ్రదర్ కె. సామ్రాట్‌గారు | 17 |
| తెలుగుదేశం-క్రైస్తవ్యం | రెవ. డా॥ కొడవటికంటి విక్రాంత్ | 19 |
| ప్రభువైన యేసుక్రీస్తు జీవితము | శ్రీమతి రిబ్కా విక్రాంత్ | 20 |
| బ్రతుకుట ఎవరి కొరకు | | 22 |
| అక్షరయజ్ఞం - బైబిల్ క్విజ్ | శ్రీమతి కె.ప్రసన్న పరాక్రమ్‌గారు | 24 |


India Evangelistic & Relief Fellowship

| EVANGELISM | RELIEF |
|---|---|
| Church Planting | Orphanage |
| Evangelestic, Crusades | Child Development Centers |
| Pastor's Seminars | Education (U.C.L.I. Schools) |
| Youth Ministry | Widows & Leprosy Care |
| T.V.Ministry | Medical Assistance |
| Magazine Ministry | Help in Natural Calamity |
| Audio Ministry | Flood Relief |
| Jail & Prison Ministry | Mobile Medical Ministry |
| IERF International | Children Care Ministry |
| Hanna Women Ministries | |


**ప్రకటన రేట్లు**

| | | |
|---|---|---|
| టైటిల్ 4వ పేజీ | ..... | రూ. 3,000/- |
| టైటిల్ 3వ పేజీ | ..... | రూ. 2,000/- |
| లోపలి పేజీ | ..... | రూ. 1,000/- |

# సంపాదకీయం.....



ప్రభువునందు ప్రియ పరిశుద్ధత పాఠకులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు.

2000 సంవత్సరానికి ఈ యుగ అంతము అని చాలా మంది ప్రవచించారు. కాదు కాదు 2012కి అని కొంతమంది నొక్కివక్కానించారు. సినిమాలు కూడా తీశారు కాని దేవుడు తమ అపారమైన కృపలో రాకడము ఆలస్యం చేస్తూ వున్నాడు. కొందరు ఆలస్యం అని ఎంచుకొన్నట్టు ప్రభువు తమ వాగ్దానం గురించి ఆలస్యంచేయువాడు కాదు. గాని ఎవడును నశియించవలెనని నిశ్చచింపక, అందరు మారుమనస్సు పొంద వలెనని కోరుచూ, మీ యెడల దీర్ఘశాంతముగలవాడై యున్నాడు. 2 పేతురు 3:9.

కనుక ప్రభువు రాకడని గురించి జోస్యం చెప్పేవారి మాటలు విశ్వసించకండి ప్రభువు దినము దొంగ వచ్చినట్లు వచ్చును అంటే ఎవరికి తెలియకుండా వచ్చును. కనుక మనమెల్లప్పడు సిద్ధముగా వుండవలెనని జ్ఞాపకము చేసుకొనండి. నూతన శతాబ్ధిలో 15వ సంవత్సరంలోనికి వచ్చాము. ఎన్నో దీవెనలు మనకు ఇచ్చుటకు దేవుడు మన వాకిట నిలువబడి వున్నాడు. ప్రతిరోజు ఈ సంగతి గుర్తించుకొనండి. ఆశీర్వాదములు మన వాకిటనే వున్నవి మనమే పొందలేకపోతున్నాము. ఈ సంవత్సరంలోనైనా మన వాకిటనున్న ఆశీర్వాదాలు పొందుటకు దేవుని ఇష్టులుగా నడుచుకుందాం.

క్విజ్‌లో ఎక్కువ మంది పాల్గోనడం లేదు. పాల్గోని బహుమతులు పొందండి. డిసెంబరు నెలలో క్విజ్‌లో గెలుపొందినవారు (గడ్డం రోజమ్మ, ప్రసాద్ నగర్, చీరాల) వారికి 25రూ॥ నగదు బహుమతి పంపుతున్నాము. పత్రికను ప్రశంసిస్తూ ఉత్తరాలు రాసిన వారికందరికి మా హృదయపూర్వక ధన్యవాదాలు.

ముఖ్య గమనికి పెరుగుతున్న ధరలు దృష్ట్యా పరిశుద్ధత సంవత్సరం చందా 150 రూపాయిలుగా పెంచక తప్పలేదు. కనుక చందాదారులు సహకరించవలసిందిగా మనవి.

2015 దేవుడు మనకి తోడైవున్న సంవత్సరముగా గుర్తింబడినది. ఈ సంవత్సరమంతా దేవుడు మనకి తోడుగా వున్నాడు కనుక అందరు మనస్సున ధైర్యము వహించి నిబ్బరముగా వుండి దేవుని కొరకు కనిపెట్ట వలసిందిగా మనవి. “యెహోవా కొరకు కనిపెట్టు వారలారా, మీరందరు మనస్సున ధైర్యము వహించి నిబ్బరముగా నుండుడి”. కీర్తన 31:24. ఆమెన్....

-ఎడిటర్

సీరియల్

# అపొస్తలుడు

11

– కొడవటికంటి

కయప సింహాసనానికి కుడిప్రక్కన ముఖ్యసభికుడు, ముఖ్య న్యాయధిపతి, అబ్దుల్ చేతడిన్ అనే వృద్ధసభ్యుడు కూర్చున్నాడు. ఎడమ ప్రక్కన నాసి అనబడే ముఖ్య జ్ఞాని కూర్చొని ఉన్నాడు. రెండు ప్రక్కల చివరలలో శాస్త్రి, నమోదు చేయువారు సిరాబుడ్లకి ఎదురుగా కూర్చున్నారు.

మొదట కయప సుదీర్ఘ ప్రసంగం చేసారు. సన్‌హెడ్రిన్ సభ చరిత్రలోనే ఒక్కసారిగా నాలుగు ఖాళీలు ఏర్పడటం ఇంతకముందు ఎన్నడూ జరగలేదని, నజరేతువాడైన యేసు లేపిన విప్లవం వలన ధర్మశాస్త్రము తెలిసినవారు కూడా శాపగ్రస్తులయ్యారని, వారి స్థానములో పెద్దలచే ఎంపిక చేయబడిన వారిలో తార్సువాడైన సౌలు ప్రధముడు అని పరిచయము చేశాడు. తర్వాత ప్రమాణ స్వీకారం జరిగింది. 'దేవుడైన యెహోవా కనుదృష్టిలో యదార్ధముగా, ప్రవక్త యైన మోషే ద్వారా అనుగ్రహింపబడిన ధర్మశాస్త్రా గంటలకు మొదలయింది. అంతవరకు ద్రాక్షారసము తీసుకొంటూ మాట్లాడుకున్నారు. భోజనము చేసేటప్పుడు కాల్చిన చేపలు వడ్డిస్తుంటే అన్నా మొదలు పెట్టాడు.

“జబదయి కుమారుడు చేపలు సరఫరా చేస్తున్నప్పుడు మంచి చేపలు వస్తుండేవి” అన్నాడు.

“ఇప్పుడు ఎక్కడికి వెళ్ళాడు?” అని సౌలు అడిగాడు.

“ఎక్కడికీ వెళ్ళలేదు. ప్రస్తుతం యెరూషలేములోనే ఉన్నాడు. తిబెరియ సముద్రంలోని చేపల జాలరులలో జబదయి చాల పెద్దవాడు, ఆస్థిమంతుడు, వృద్ధుడు. నజరేయుడు జబదయి సోదరి, మరియమ్మ కుమారుడు. అలాగని కాకపోయినా తొలిరోజులలో జబదయి రెండవ కుమారుడు యెహాను, హేరోదు ఇంటికి, ప్రధాన యాజకుని ఇంటికి చేపలు సరఫరా చేసేవాడు.

యెరూషలేముకు చేపలు తెచ్చినప్పుడల్లా బాప్తిస్మకుడైన యోహానుగారి దగ్గర కొన్ని రోజులు శిష్యుడుగా ఉండేవాడు. నజరేయుడు వచ్చిన తర్వాత అతని అన్నతో కలసి గ్రామాలు, పట్టణాలు తిరగటం మొదలుపెట్టారు. యేసు మరణించిన తర్వాత ఈ గలలీయులందరూ యెరూషలేములోనే నివసిస్తూ 'ఈ నజరేయుడే మరణాన్ని జయించి లేచాడు' అని ప్రజల మధ్యలో ప్రచారం చేస్తున్నారు” అని ముగించాడు.

నజరేయుడు అనినప్పుడు, యేసు అని పలికేటప్పుడు అన్నా ముఖం వికృతంగా మారిపోయేది. యేసునామము పలుకవలసి వచ్చినప్పుడల్లా ఆ నామం మీద ఎంత ద్వేష మున్నది కనబడేది.

ఒక్క దేనారమైనా సంపాదించి నిల్వ చెయ్యలేని, ఒక విద్యలేని వడ్లవాడు, సీజరు తర్వాత అంతగొప్ప స్థానములో బంట్రౌతులు కలిగిన ఈ కోటీశ్వరుడ్ని ఒకరకంగా జయించి, ఓడించినట్టే కదా!? అని మనస్సులో అనుకున్నాడు. ఒక్క మాటలో చెప్పాలంటే ఈ భూమి మీద అన్నా భయపడేది ఈ ఒక్క నామానికి మాత్రమే అనుకున్నాడు.

“యోహానుకి ఎంత వయస్సు ఉంటుంది?” అన్నాడు సౌలు.

“20 సంవత్సరాలు కూడ ఉండవు. 19 సంవత్సరాలు ఉండవచ్చును. కాని ఇప్పుడు అతని ధైర్యము– మరణముకు కూడ భయపడనిది” అని చెప్పాడు అన్నా.

సౌలు ఆలోచిస్తున్నాడు. “ధర్మశాస్త్రముతో పరిచయము ఉందా?” అని అడిగాడు.

“యేసు వెంబడి ఉన్న వారందరు విద్యలేని పామరులే! కాకపోతే యేసు మరణించిన తరువాత, సన్‌హెడ్రిన్ సభ సభ్యులు వారితో కలసిన తర్వాత కొంచెం మార్పు వచ్చింది” అని చెప్పాడు.

“ఇంత మంది మార్భలము ఉండికూడా, మీరు వారిని ఎందుకు హద్దులలో ఉంచలేక పోయారు?” అడిగాడు సౌలు.

"వాళ్ళు యేసు శిష్యులమని చెప్పుకొంటున్నా, యూదా మత కట్టుబాట్లన్నింటికీ లోబడి ఉంటున్నారు కదా! అంతే కాకుండా అందులో కలసిపోయిన వారందరూ – మా పరిసయ్యుల తెగకు చెందిన వారే! సద్దూకయ్యులలో ఒక్కరైనా వారిలో కలవలేదే! కొద్దినెలల క్రితం వారిని బంధించి సభలో హాజరు పరిస్తే, వారు సభను ఎదిరించి నప్పుడు వారికి మరణశిక్ష విధించాము. కానీ మా గురువుగారైన గమలియేలుగారు అందుకు వ్యతిరేకించి నందువలన ఆ శిక్షను అమలుపరచలేదు" అన్నాడు.

సన్‌హెడ్రిన్ సభకు ఉన్న అధికారాలు సౌలుకు తెలుసు. పిలాతు అధికారానికి రాక పూర్వము, మరణశిక్ష కూడ విధించే అధికారం ఈ సభకు ఉంది. తర్వాత రద్దు చేయబడింది.

అయినప్పటికీ "ఇది ప్రజలలో వ్యాపించకుండుటకై పనిచేయడం తన జీవిత ధ్యేయము అనుకునే యాజకుడు ఒకడు చాలు!" అని బాధగా నిట్టూర్చి లేచి నిలబడ్డాడు.

సౌలు కయప వద్దను, అన్నా వద్దను సెలవు తీసుకొని బయటకు వచ్చినప్పుడు రాత్రి మొదటిజాము గడిచి పోయింది. దేవాలయము యొక్క ద్వారాలన్ని మూత వేయబడి ఉన్నాయి. దేవాలయము వెనుక భాగంలో అంటే పడమటి వైపున ఉన్న పర్ణశాలల వంటి వాటిలో జన సంచారం కనబడింది. ఎదురుపడిన వ్యక్తిని ఆపి "ఏదైనా మ్రొక్కుబడులకు వచ్చిన పరదేశులా?" అని అడిగాడు.

"లేదు, వారంతా యేసు శిష్యులు. ఇక్కడి వారే, ఇక్కడే ఉంటారు" అన్నాడు.

"వారికి ఇళ్ళు లేవా?" అని అడిగాడు.

"పూర్వం వీరంతా ఆస్తిపరులే! కాని వారికి కలిగిన భూములైనను, ఇండ్లైనను అమ్మి వాటి వెల తెచ్చి శిష్యులలో పెద్దలకు అప్పగించారు. ఇక్కడ ఉన్న ప్రతివానికి వానివాని అక్కరకొలది పంచిపెట్టారు. ఇక్కడ ఉన్నవారికి ఏమి కొదువ ఉండదు. ఎవడును తనకు కలిగిన దానిలో ఏదియు తనదని అనుకొనడు.

ఇక్కడి విశ్వాసులందరు ఏక హృదయాన్ని, ఏకాత్మను కలిగి ఉంటారు. వారికి కలిగినదంతయు వారికి సమిష్టిగా ఉంటుంది" అని ఆగి, సౌలు ముఖం వైపు కొంచెం తేరి చూసాడు. సౌలు దుస్తులు చూసి ఒక అడుగు వెనక్కివేసి, చాలా మాట్లాడానే అని గొణక్కొని గబగబ వెళ్ళిపోబోయాడు.

సౌలు చెయ్యిచాపి అతనిని పట్టుకొని "కొంచెం ఆగండి, తొందరగా వెళ్ళాలా? మీరు ఏ ఊరి నుండి వచ్చారు? మీ భాష ఇక్కడిది కాదు కదా?" అని సౌలు అడిగాడు.

అతని మాటలోని కాఠిన్యత చూసి, ఆ వ్యక్తి నిలబడి "మీరు యెరూషలేముకు క్రొత్తగా వచ్చారా?" అని అడిగాడు.

"నేను కుప్రలోని యూదుడను. ఈ మధ్యకాలంలో నజరేయుడైన యేసునామాన్ని విని, విశ్వసించి, కొంతకాలం పరిశుద్ధులతో కలసి ఉండటానికి వచ్చాను" అన్నాడు.

సౌలు అతనిని ప్రేమగా చూసాడు. ఆ ప్రేమకి కారణం – బర్నబా అతని మనస్సులో మెదలటం వలననే కావచ్చు. ఇద్దరూ కలసి తూర్పు వైపు ఉన్న బాటలో నడుస్తూ "మీరెక్కడికి వెళుతున్నారు?" అని సౌలు అడిగాడు.

"బేతనియ గ్రామము, లాజరుగారికి ఒక కబురు చెప్పాలి" అన్నాడు.

"లాజరుగారు ఎవరు?" అని సౌలు అడిగాడు.

అప్పటికి కెద్రోను వాగులోకి వెళ్ళటానికి, పల్లము ప్రక్కన ఉన్న మండపం దగ్గరికి వచ్చారు. ఎదురుగా ఒలీవల కొండమీద ఒలీవల చెట్ల మీదనుంచి చల్లటి గాలి వారి శరీరాలను తాకి, ఒక విధమైన విశ్రాంతి కలిగించింది. అక్కడ కూర్చున్నారు. "మీ పేరు?" అని అడిగాడు సౌలు.

"అజల్యా" అని అన్నాడు.

అతని వయస్సు 25 సంవత్సరాల లోపు ఉండవచ్చు. ఇంకా ముఖం కఠినపడలేదు. నమ్మినదాన్ని అరమరిక లేకుండా హత్తుకొనే వయసు.

"యోసేపు పరిచయమేనా?" అని అడిగాడు సౌలు.

"బర్నబాగారండి? ఆయన తెలియని వారు కుప్ర, అంతియొకయ, తూరు, సిదోను, సమరయ, యూదయ లలో ఎవ్వరూ లేరండి. చాల మంచి హృదయముగలవాడు.

సరే! మీరెలా అయినను ఎరుగుదురు?" అని అడిగాడు.

"ఉదయం ఆయనన కలిసాను" అన్నాడు సౌలు. "ఆయన నజరేయుడైన యేసుని ఎలా తెలుసుకున్నాడు?" అని మళ్ళీ అడిగాడు.

"యేసు ఈ లోకంలో ఉన్నప్పుడు బర్నబాగారు ఈ మహాసభలో సభ్యుడు. ఒక రాజుకు కలిగినంత ఆస్థి ఆయనకు కుప్రలో ఉన్నా, ఎప్పుడూ యెరూషలేములోనే ఉండేవాడు. విలాసవంతమైన జీవితం, సమృద్ధి అయిన ధనాన్ని కలిగి ఉండేవాడు. కాని జీవితంలో ఇంకా ఏదో కొరత ఉండినట్లు ఉండేవాడు. అయినా ధర్మశాస్త్రాన్ని అక్షరం పొల్లుపోకుండా బాల్యము నుంచే ఆచరించేవాడు.

యేసు సిలువ వేతకు పదిరోజుల ముందు ఆయనను యెరికో పట్టణములో చూసాడు. యేసు చూడగానే బర్నబా గారు పరుగెత్తుకొని వెళ్ళి మోకరించి నిత్యజీవమునకు వారసుడనగుటకు నేను ఏమి మంచి కార్యము చెయ్య వలెనని అడిగాడు.

'నీకు కలిగిన ఆస్తిని అమ్మి, బీదలకు పంచి ఇచ్చి, నీవు వచ్చి నన్ను వెంబడించు' అని యేసు సెలవిచ్చాడట.

ఆ రోజున ఆస్తిని వదలలేక, యేసును వదలలేక, ఆయన అనుభవించిన బాధ వర్ణనాతీతం. యెరూషలేములో బర్నబా అక్క మరియమ్మ యింటికి యేసు వస్తుంటాడు. తర్వాత కూడా యేసును గురించి ఎంతో తెలుసుకున్నాడు. కాని ఒక విచిత్రమయిన సంగతి జరిగింది..." అన్నాడు అజల్యా.

"అదేమిటి?" అన్నాడు సౌలు. "నీ ఆస్థిని అమ్మి బీదలకిమ్మని యేసు ఎందుకు అన్నాడు? 'కొంతఅమ్మి' అనకుండా – ఆస్థి అంతా ఎందుకు అమ్మి బీదలకివ్వ మన్నాడు?" అని ఆలోచిస్తూనే తనకు తెలియకుండానే అన్నాడు.

"యేసును గురించి–ఆయన భూమి మీద ఉన్నప్పుడు అనేకులు విన్నారు. కాని కొద్దిమందికి మాత్రం ఆయన అర్థమయ్యేవాడు. ఆయన సిలువ వేయబడిన రోజే ఆయనను బహిరంగంగా అంగీకరించని వారందరూ అంగీకరించారు.

వారిలో నికోదేము, అరిమితయి యోసేపు, రోమీయు డైన యూలి".

సౌలు మెదడులో ఏదో మెరసినట్టయింది. 'యూలి' – ఈ పేరు ఎక్కడ? "యూలి" అన్నాడు సౌలు పెద్దగానే.

"ఔను! యూలి – శతాధిపతి. యేసును సిలువమీద నుండి దించిన వారిలో ఒకడు. ఆయనతో పాటు నలుగురు సైనికులను యేసుకు సిలువ దగ్గర కావలి ఉంచారు. ఆరోజు నుండి యేసును యూలి అంగీకరించాడు" అని చెప్పాడు.

కర్మేలు కొండవద్ద తనని రథం ఎక్కించుకొన్న యూలి ముఖం మెదిలింది. ఎంత సౌమ్యమైన చూపు, దయగల మాట, ఆ యూలియేనా? ఇంకెవరైనా అయి ఉండవచ్చునా? అనుకున్నాడు.

"ఏమని అంగీకరించాడు?" అని సౌలు అడిగాడు.

"యేసు నిజముగా దేవుని కుమారుడని" అన్నాడు అజల్యా.

"సిలువ మీద మరణించినవాడు దేవుని కుమారుడెలా అవుతాడు?" ఆసక్తిగా అడిగాడు సౌలు.

"సిలువ మీద ఆయన దేవునితో మాట్లాడటం యూలి విన్నాడు" అన్నాడు అజల్యా.

"ఏమి విన్నాడు?" అన్నాడు సౌలు.

"యేసు ఎక్కువ ఏమి మాట్లాడలేదు. అసలు సిలువ మీద ఉన్న వ్యక్తిలోని రక్తం అప్పటికే సగం కారిపోయి వుంటుంది. మరీ తప్పని సరైతేనే కాని మాట్లాడలేదు. కాని యేసు తన తండ్రితో మాట్లాడకపోతే ఆ కోపం తనమీద నిలిచియుండేది అని యూలి నమ్ముతున్నాడు" చెప్పాడు అజల్యా.

**(సశేషం)**

Read Our Internet Edition @
**www.holinessmagazine.com**

# యజమాని - మనిషి
## (లియో టాల్‌స్టాయ్)



**ఆ రోజు పరి.నికోలస్ వేడుకదినము**. వాసలి ఆంద్రూవిచ్ చర్చిలోని పెద్దలలో ఒకడైనందున పండుగ ప్రార్థన ముగియగానే బంధువులు స్నేహితులందరితోటి విరామసమయం గడిపి వెంటనే ప్రయాణానికి సిద్ధపడు తున్నాడు. తనకున్న ఒకే ఒక పనివాడు 'నికట'ని స్లెడ్జి బండి సిద్ధము చెయ్యమన్నాడు. నికట యాభై సంవత్సరాల వయస్సు ఉన్నవాడు. ప్రక్క ఊరిలో కాపురం. అతని భార్య రూతు – ఇద్దరు ఆడపిల్లలు, ఒక మగపిల్లవానితో గుట్టుగా కాపురం చేస్తుంది. నికట ఓడ్కా త్రాగిన రోజు తప్పితే మిగిలిన రోజులన్నీ చాలా కష్టజీవి. మంచి పనివాడు. రెండు నెలల క్రితం ఓ సాయంకాలం త్రాగినప్పుడు తన డబ్బులు, దుస్తులు కూడా పోగొట్టుకున్నాడు. అందువలన ఇక త్రాగనని ఒట్టు పెట్టుకున్నాడు.

నికట–యజమాని పాకలో ఉన్న గుఱ్ఱానికి నీరు పెట్టి జీను కట్టి కళ్ళాలు తుడుస్తుంటే యజమాని కొడుకు పది సంవత్సరాల వయస్సున్న జిమ్మి వచ్చి "బండి సిద్ధమయిందా? అని నాయన అడగమన్నాడు" అని అన్నాడు.

"బండి సిద్ధమే!" అని వాటెడు ఎండు గడ్డిని స్లెడ్జి బండి అడుగున వేసి పైన చాప పరిచాడు. వాసలి బయటకు వచ్చి స్లెడ్జి బండిలో కూర్చుంటుంటే అతని భార్య వచ్చింది. "పనివాడు నికటని ఎందుకు మీతో తీసుకుని వెళ్ళేది?" అని అడిగింది. వాసలి బండి దిగి చర్చిలోని బీరువా తీసి రెండువేల ఏడువందల రూపాయలు తీసుకుని తన దగ్గరవున్న మూడువందలు కలిపి మొత్తం మూడువేల రూపాయలు రెండుసార్లు లెక్కపెట్టి తను ధరించిన ప్యాంటు వెనుక జేబిలో పెట్టుకుని నికటకి కళ్ళాలు ఇచ్చి బండిలో కూర్చున్నాడు.

తను వెళ్తున్న పని చాలా ముఖ్యమైంది. తను కొనదలుచుకున్న చెట్లు దాదాపు పదివేలు చేస్తుంటాయి. కాని ఆ తోట యజమాని యవ్వనస్థుడైనా బాగా డబ్బు ఉన్నవాడు. అందువల్ల బేరం కుదరడం లేదు. వేరే బేరగాళ్ళు రాకముందే తను ఆ ఊరు చేరుకోవాలని తొందరపడు తున్నాడు. బయట మంచు కురుస్తున్నది. ఏ అడ్డంకి రాకముందే అక్కడికి చేరాలని "బండి కొంచెం వేగంగా నడుపు" అన్నాడు. ఓ అరగంట ప్రయాణం చేసేటప్పటికి కురుస్తున్న మంచు దారిని కప్పేసి ఉంది. బాట కనిపించలేదు. కొంచెం దూరం పోయిన తర్వాత గుఱ్ఱం ఆగిపోయింది. బండి ఆపి నికట – క్రిందకు దిగి బాట ఎక్కడ మలుపు తిరిగిందో చూడబోయాడు. గుఱ్ఱం దగ్గరకు రాగానే కాలుజారి యాభై అడుగుల పల్లంలోకి పడిపోయాడు. చాలాకష్టంగా ఎక్కి వచ్చాడు. ఇప్పుడు మంచు ఎక్కువగా కురుస్తుంది.

వాసలి నికటని పిలిచి "దగ్గరలో ఏదైనా ఊరు ఉందా? అక్కడికి పోనియ్" అన్నాడు.

వాసలి చాలా ఖరీదైన ఉన్ని వస్త్రాలు ధరించివున్నాడు. నికట బండిని వెనక్కి త్రిప్పి ఎడమప్రక్కగా నడిపించాడు. కొంచెంసేపటికి పది చిన్న ఇండ్లు కలిగిన గ్రామము కనిపించింది. ఆ గ్రామములో ప్రవేశించినప్పుడు యూదా అనే వ్యక్తి బండి దగ్గరకు వచ్చి వాసలికి నమస్కారము చేశాడు. అతను గుఱ్ఱాలు దొంగిలించే వ్యక్తి. నికటని చూసి "ఎక్కడికి?" అన్నాడు.

"అల్పాకి" అన్నాడు.

"అలాగైతే ఓ ఫర్లాంగు పోయిన తర్వాత ఎడమప్రక్కకు పోయే బాటలో వెళ్ళండి" అన్నాడు.

నికట సంతోషంగా బండిని నడుపసాగాడు. ఓ పదినిమిషాలు ప్రయాణం చేసేటప్పటికి మంచు ఎక్కువగా కురిసినందున రహదారులన్నిటి మీద రెండడుగుల మంచు గట్టకట్టి దారి తెలియలేదు.

"గుఱ్ఱం పగ్గాలు వదిలెయ్యి. మనం వెళ్ళవలసిన దారి దానికి తెలుసు. అది తీసుకొని వెళ్తుంది" అన్నాడు వాసలి.

నికట కళ్ళెం వదిలి "నువ్వు దారి చూపించు" అని గుఱ్ఱం వీపుమీద తట్టాడు. చీకటిపడింది. వాసలి అసహనంగా ఉన్నాడు. ప్రయాణానికి ఇంత సమయం పట్టింది. ఈపాటికి ఇంటికి తిరిగి రావాల్సింది అని చాలా వ్యధ పొందుతున్నాడు. చీకటి పడింది. గుఱ్ఱం పదిహేను నిమిషాలు నడిచేటప్పటికి పది ఇండ్లు కనిపించాయి. తను పోవలసిన గ్రామము ఇదే అనుకున్నాడు వాసలి. కాని ఇంతకుముందు యూదా – కలుసుకున్న గ్రామమే అని అర్థమైంది. మంచువల్ల రహదార్లు కప్పబడి గుఱ్ఱానికి కూడా దారి తెలియలేదని ఆ ఊరి కరణం ఇంటికి వచ్చారు. కరణం – ఇంట్లోకి ఆహ్వానించి "ఈ మంచు తుఫానులో మీరు ప్రయాణం చెయ్యడం మంచిది కాదు. ఈ రాత్రి ఇక్కడే పండుకోండి. తెల్లవారిన తర్వాత మా మనిషిని మీకు తోడు ఇచ్చి పంపుతాను" అన్నాడు. వారికి టీ ఇచ్చారు. వాసలి మనసు వ్యాపారం మీదనే ఉంది. ఈరోజే ఆ వ్యాపారం ఒప్పందం మూడువేలు చెల్లించి రాసుకోవాలని పట్టుబట్టాడు. "అలాగైతే మీరు ఊరు దాటిన తర్వాత దక్షిణంగా కనబడే చెట్ల గుబురుకు పడమరగా వెళ్ళండి పదినిమిషాలలో వెళ్తారు" అన్నాడు.

వాసలి స్లెడ్జి బండిలో కూర్చున్నాడు. బండి బయలు దేరింది. "ఈ రాత్రి ప్రయాణం మంచిది కాదేమోనయ్యా!" అన్నాడు నికట.

"ఇవన్నీ చిన్నప్పటినుండి మనం తిరిగిన ప్రదేశాలేకదా. కరణంగారు చెప్పినట్లు పోనియ్" అన్నాడు యజమాని ధోరణిలో.

నికట బండిని చెట్లగుబురుకు పడమరగా పోనిచ్చాడు. మంచు విపరీతంగా కురుస్తోంది. ఒకచోట బండి నిలిచింది.

"ఎందుకు ఆగావు?" అని పెద్దగా అరిచాడు నికట, గుఱ్ఱాన్ని చూస్తూ.

గుఱ్ఱం కదల్లేదు. ఎదురుగా కొండ కనిపిస్తోంది. నికటా స్లెడ్జి దిగి గుఱ్ఱం దగ్గరకు వచ్చాడు. గుఱ్ఱం వద్దనుండి ఎదురు కొండ వరకు పెద్దలోయ. ఎడమప్రక్కకూడా లోయ.

"అయ్యా!" అని పిలిచాడు.

వాసలి బండి దిగి నికట వద్దకు వచ్చాడు. "ఇప్పుడేమి చెయ్యాలి?" అని నికటని అడిగాడు.

"అదే నాకు అర్థం కావడంలేదు. మనం ఇప్పుడు వెనక్కి వెళ్ళి తిరిగి మనం ఇప్పుడు మనం వచ్చిన గ్రామానికి వెళ్ళలేము" అని, నిదానంగా స్లెడ్జి బండిని విశాలమైన మంచు మీదకు తెచ్చాడు.

వాసలి నిట్టూర్చి స్లెడ్జి బండిలో మంచు పడని చోట కూర్చున్నాడు. గుఱ్ఱం తలమీద వీపు మీద మంచుపడి గడ్డకడుతుంది. అది ఎన్నిసార్లు విదిలించుకున్నా లాభం లేకపోయింది.

బండి అడుగుభాగములో వేసిన ఎండుగడ్డి బయటకు తీస్తుంటే విపరీతమైన గాలికి ఎగిరిపోతుంది. నికట విశాలమైన గుంట చేతితో తీసి గడ్డి అందులో వేసి లోపల కూర్చుని తను వేసుకొనిన కోటుని తలమీద కప్పుకుని కూర్చున్నాడు. ఓ గంట గడిచిపోయింది. అక్కడున్న ప్రాణులు ముగ్గురు ఎవరి ఆలోచనలో వారున్నారు. నికట గుఱ్ఱాన్ని చూస్తూ తెల్లవారేదాకా బ్రతికి ఉంటుందా? అని ఏడ్చాడు.

వాసలి – ఈపాటికి మరొక వ్యాపారి ఎవరైనా వచ్చి తను కొనాలనుకున్న తోటను కుదుర్చుకొన్నాడేమోనని చింతించసాగాడు. వాసలి ఆలోచనలు కొంచెంసేపటికి మారి పోయాయి. తను ఈ రోజు చర్చిపనుల్లో ఉండకపోతే బాగుండేది అనుకున్నాడు. తన వ్యాపారాలు, తనకు డబ్బు ఇవ్వవలసిన వారు తను లేకపోతే తన భార్యకు ఇస్తారా? తన భార్యకు తన వ్యాపారాలేవి తను చెప్పలేదు. మనిషి జీవితం ఏ రోజు ఎలా మలుపు తిరుగుతుందోనన్న ఆలోచన తనకెన్నడు తట్టలేదు. ఇలా చాలాసేపు ఆలోచించి తెల్లవార డానికి ఎంత సమయము ఉందోనని తన గడియారం వైపు చూస్తే ఏమీ కనబడడంలేదు. నికట నిద్రపోతున్నట్లున్నాడు. అసలు కదలటం లేదు. తనకు దగ్గరగా తోడేలు స్వరం వినిపించింది. ప్రాణ భయంతో వాసలి ఊపిరి బిగపట్టి

విన్నాడు. గుఱ్ఱం కదలిక కూడా తోడేలు వచ్చిన సంగతి నిర్ధారణ చేసింది. తను కూర్చున్న చోటునుండి కదలలేదు. కొంచెంసేపటికి కొంచెం దూరంలో తోడేలు వెళ్ళిపోతున్నట్లు గ్రహించాడు.

అతికష్టంమీద జేబులోనుండి అగ్గిపెట్టె, సిగిరెట్టు తీసి ముట్టించాడు. రెండు దమ్ములు లాగిన తర్వాత కొంచెం వెచ్చబడినట్లుంది. ఇప్పుడు ఆలోచించడం మరలా ప్రారంభ మైంది. స్లెడ్జి బండి అయితే ప్రయాణించలేము. కాని గుఱ్ఱం మీద కూర్చుంటే అదే మనల్ని సురక్షిత ప్రాంతముకు తీసుకొనివెళ్తుంది. మరి నికట సంగతి ఏమిటి? అనుకున్నాడు. అందరు చనిపోయే కంటే ఒక్కరైనా బ్రతకటం మంచిది కదా? అనుకున్నాడు. అతికష్టంమీద తన మీద పడిన మంచును తొలగించుకుని బయటకు వచ్చాడు. స్లెడ్జి క్రిందకు దిగితే మోకాళ్ళలోతు మంచు వుంది. అతి కష్టం మీద గుఱ్ఱం మీద పండుకొనినట్లుగా చేరాడు. గుఱ్ఱం కదిలింది. అరగంట ఎటుపోతుందో తెలియకుండానే ప్రయాణం చేశాడు. ఒకచోట గుఱ్ఱం ఓ గుంటలో పడిపోయింది. మంచులో మునిగి పోతుంది. తను చాలా లోతులోకి దొర్లిపోయాడు. గుఱ్ఱం బ్రతికివున్నదో లేదో కూడా తెలియదు. కుడిచెయ్యి విరిగినంత నొప్పిగా ఉంది. ఒకచేత్తోనే చిన్నగా ప్రాకుతూ పైకి వచ్చాడు. గుఱ్ఱం దగ్గరకు వచ్చి దాని కళ్ళాం పట్టుకొని లాగుతుంటే అది ప్రయత్నించి పైకి వచ్చింది.

నికట కండ్లు తెరిచాడు. కండ్లకు ఏమి కనిపించలేదు. కుడిచేత్తో తనమీద ఉన్న మంచును ప్రక్కకు లాగాడు. చాలాసేపు కూర్చున్నందువల్ల తన కాళ్ళు అలాగే ముడుచుకొని రాళ్ళవలె అయిపోయాయి. పెద్దగా అరవాలంటే నోరు తెరుచుకోలేదు. ఇప్పుడు తను చచ్చిపోతున్నాడు. దేవుడ్ని ప్రార్థించడం మొదలుపెట్టాడు. తను ఇతరులెవరిని మోసం చెయ్యలేదు. త్రాగినప్పుడు భార్యను కొట్టాడు. ఆమెకు మనసులో క్షమాపణలు చెప్పుకుని తన పాపాలు క్షమించమని దేవుడ్ని ప్రార్థించడం ప్రారంభించాడు. వాసలి రొప్పుతూ వస్తున్న శబ్ధం లీలగా వినివస్తుంది. "నికటా! నికటా!" అని ముఖం తుడుస్తున్నాడు.

"వాసలి ఏడుస్తున్నాడు ఎందుకు?" అనుకున్నాడు నికటా. ఇప్పుడు తన తల ప్రక్కకు తిరిగింది. కండ్లు ఎత్తి వాసలి ముఖంలోకి చూశాడు. తన రెండు సంకల క్రింద చేతులు పెట్టి తనను బయటికి లాగుతున్నాడు. తన కాళ్ళు కూడా ఇప్పుడు కదిలాయి. స్లెడ్జి బండి మీదకు తనను లాక్కెళ్ళుతున్నాడు. ఇంతకుముందు వాసలి పండుకొనిన చెక్క మీద తనను పండుకోబెట్టాడు. తన చినిగిపోయిన కోటును ఊడదీసి వాసలి తన కోటును విప్పదీసి నికటను గట్టిగా కరుచుకొని కోటు కప్పుకున్నాడు. ఇప్పుడు ఒళ్ళు కొంచెం నయమనిపించింది.

"నికటా నన్ను గట్టిగా వాటేసుకో! యజమాని పనివాడు అనే బేధం దేవునికి లేదు మనుష్యులకే! ప్రాణం కాపాడేది దేవుడే!" అని అతికష్టం మీద వాసలి పలుకుతున్నాడు.

ఇప్పుడు నికటకి కండ్లు మూతలు పడుతున్నాయి. గుఱ్ఱం ఎక్కడ? పాపం అది ఎలావుంది? అనుకుంటూ... ఇక మెదడు పనిచెయ్యడం లేదు తను చచ్చిపోయాడు అనుకున్నాడు.

తెల్లవారి పదిగంటలకు రైతు కూలీలు నడుం వరకు మంచులో కూరుకుపోయిన గుఱ్ఱాన్ని చూసి వచ్చారు. దాని కండ్లు తెల్లగా మెరుస్తున్నాయి. కనురెప్పలు బిగుసుకొని పోయి మూతపడలేదు. స్లెడ్జి బండిపైన కట్టబడిన రుమాలు మంచులో నుండి బయటకు కనబడు తున్నది. నాలుగు అడుగుల మంచును తొలగించారు.

క్రింద నికట, పైన వాసలిని గుర్తుపట్టారు. ఇద్దరి శరీరాలు బిగుసుకొనిపోయి ఉన్నాయి. ఇద్దరిని అతి కష్టం మీద వేరుచేశారు. నికటకి రైతు కూలీల స్వరాలు వినిపిస్తు న్నాయి. కాని తన శరీరంలో ఏమీ కదలికలేదు.

తను పరలోకంలో ఉన్నాడా? ఈ లోకంలో ఉన్నాడా? పరలోకంలో కూడా రైతు కూలీలు, యజమానులు ఉంటారా? అనుకొంటున్నాడు.

**ఎవరో తన కనురెప్పలను మూస్తున్నారు.**

**(సశేషం)**

# దైవశక్తి




(గత సంచిక తరువాయిభాగం)

చిన్న బిడ్డలు ఆ దృశ్యం చూసి పెద్దగా అరిచారు అదొక పెద్ద త్రాచుపాము సుమారు 20 అడుగులు వుంటుంది. దాని పడగ గుమ్మానికి సరిపోయింది. నోటిలో నుంచి నిప్పులు కక్కుతున్నది పడగ మీద ఒక పుర్రె ఆ పుర్రెలో కళ్ళు చింతనిప్పులవలె వున్నవి. అది మెల్లగా ఇంటి సీలింగ్ వైపు ఎగబాకుతూ తోకతో తలుపులను కిటికీలను పగలగొట్ట సాగింది. అలాగు రాముపిళ్ళై వున్నవైపు కదల సాగింది ఈ పాము బుసగొట్టట లేదు దానిలోనుంచి ఏదో భయంకరమైన మూలుగు వస్తుంది. రాముపిళ్ళై భయంతో వణికి పోయాడు. అతను భయంతో భార్యా పిల్లలదగ్గరకు పరిగెత్తుకుంటూవచ్చి పడ్డాడు. ఇంతలో అందరు చూస్తుండగానే రాముపిళ్ళై భార్యమీదికి విసిరిన సిలువ ఎత్తుగా వున్నట్టు అందరికి కనబడింది. దానిలో నుంచి దేదిప్యమానంగా వెలుగు ప్రకాశింపసాగింది. గది అంతా వెలుతురుతో నిండి పోయింది. వెంటనే సర్పములో నుండి పెద్ద మూలుగులు, కీచుకీచు శబ్ధాలు రాసాగినివి చూస్తుండ గానే అంతపెద్దపాము బల్లిలాగా అయిపోయి కిందపడి పోయింది. పడిపోతూనే భయంకర పిశాచి ఆకారంలో నిలబడి వారివైపు రాసాగింది. పిల్లలు తల్లి ఆఖరికి రాము పిళ్ళైకూడా యేసయ్యా కాపాడు యేసయ్యా కాపాడు అని అరవసాగాడు వెంటనే ఆ సిలువలోనుంచి ఒక అగ్ని కెరటము మహాశబ్ధముతో దూసుకువెళ్ళి ఆ పిశాచిని కాల్చి వేయగా అది బుడిదగా మిగిలిపోయింది. ఒక్కసారిగా అంతా నిశ్శబ్ధం అయిపోయింది. ప్రశాంతత చల్లని వాతావరణం ఏర్పడింది. ఆ ప్రశాంతతలో ఒక మెల్లని స్వరము బిడ్డలారా అని పిలవడం వినబడింది. అందరు ద్వారం వైపు చూశారు. అక్కడ థామస్‌గారు తెల్లని వస్త్రాలు ధరించి నిలవబడి వున్నాడు. అందరు ఆశ్చర్యపోయారు ఉన్నికుట్టి పరిగెత్తుకుంటు పోయి తామస్‌గారిని కౌగిలించు కొని పెద్దగా ఏడ్చింది. తామస్‌గారు చిరునవ్వుతో భయపడ వద్దు ఈ రోజుతో మీ ఇంటికి పట్టిన పీడ వదిలి పోయింది. అయితే ఆ బూడిదను జాగ్రత్తగా ఒక చిన్నపెట్టెలోగాని సంచిలోగాని భద్రపరిచి స్మశానంలో లోతుగా గుంట త్రవ్వి పాతిపెట్టాలని చెప్పాడు. నెమ్మదిగా తోమాగారు రాముపిళ్ళై భార్య కౌసల్య దగ్గరికి వచ్చి ప్రార్ధనచేసి చెయ్యిపట్టి లేపగానే ఆమె దిగ్గున లేచి నడుచుచు దేవుని స్తుతించసాగింది. అంతలోకే తామస్ గారి శిష్యులు పదిమందిదాకా

**...మిగతా 23వ పేజిలో**



# క్రొత్త సంవత్సరము

రెవ.డా॥ కె. జోసఫ్

క్రొత్త సంవత్సరం వచ్చిందంటే మనుషులందరు కుల మతాలతోటి సంబంధం లేకుండా క్రొత్తదనం కోరుకుంటు వుంటారు. అయితే ప్రసంగి 1:9లో "మునుపు వుండినదే ఇక వుండబోవునది మునుపు జరిగినదే ఇక జరగబోవును. సూర్యుని క్రింది నూతనమైనది ఏదియులేదు". ఇది అక్షరాలా నిజం నా చిన్నతనంలో ఒక వ్యక్తి శాస్త్రాలు తత్వజ్ఞానము కలిగిన ఒక మేధావి నూతనమైనది ప్రపంచంలో ఏదైనా వున్నదా అని ఒక సవాలు వేశాడు. దానికి ఎవరూ కూడా జవాబు చెప్పలేక పోయారు. ఇప్పుడు కూడా ఎవరు చెప్పలేక పోయారు. ఒక వేళ మనకు విమానాలు, టీవీలు, టెలిఫోన్‌ల వంటి అధునాతన టెక్నాలజీ అంతా కూడా క్రొత్తది కదా అని అనుకుంటే ఈ టెక్నాలజీ అంతా పూర్వము వుండినదే అయితే అది వేరే రూపంలో వుండేది. ఇప్పుడు మనం చూస్తున్న క్రొత్త క్రొత్త ఫ్యాషన్‌లు కూడా పూర్వకాలం వుండినవే ఇప్పుడు నాగరికతా అనే పేరుతో శరీరాన్ని expose చేస్తూ మనము ధరించే పొట్టిపొట్టి వస్త్రాలు ఆదికాలంలో ఆనాటి అనాగరికులు ధరించేవారు. ఆ మాటంటే అందరికి చాలా కోపం వస్తుంది కూడా ఏమైనప్పటికి క్రొత్తదంటూ ప్రపంచంలో ఏమీలేదు.

క్రొత్తదనం అనేది ఒక్క క్రీస్తులోనే మనకు దొరుకుతుంది. అంటే ప్రకృతి సంబంధమైన క్రొత్తదనం ప్రపంచంలో లేదు కానీ ఆత్మ సంబంధమైన క్రొత్తదనం ఒక్కటే మనం పొందగలం. అది కూడా క్రీస్తులోనే. క్రొత్తగా జన్మించితేనే యోహాను 3:3 క్రీస్తు యేసునందు వున్నవాడు నూతన సృష్టి పాతవి గతియించెను ఇదిగో క్రొత్తవాయెను 2 కొరింథీ 5:17.

ఈ క్రొత్తదనము మీద మనం అనేక ప్రసంగాలు విని వుంటాము అయినప్పటికి మనం బాహ్యంగా క్రొత్తగా కనబడాలనే చూస్తాముగాని అసలైన క్రొత్తదనం కొరకు చూడము. క్రొత్త సంవత్సరం క్రొత్త వస్త్రాలను క్రొత్త క్రొత్త ఆభరణాలలో ఇళ్ళు వళ్ళు క్రొత్తగా అలంకరించుకొవడంలో లేదు అని మనకందరికి తెలుసు. అయినప్పటికి దానిమీద మన ధ్యాస. అసలైన క్రొత్తదనము క్రీస్తునందు మారిన జీవితంలో వుంటుంది. క్రీస్తు భోదలలో క్రొత్తదనం వుందని అందరికి తెలుసు. అప్పటికి ప్రజలు కూడా "ఇదేమిటి క్రొత్త బోధగా వుందే అన్నారు". ఆ క్రొత్త బోధల ప్రకారం జీవించే వారందరూ క్రొత్త జీవనము కలిగివున్నారూ శరీరసంబంధ మంతయు పాతది. ఆత్మ సంబందమైనది నూతనమైనది. అనగా శరీరసంబంధమైన కార్యములను అనగా జారత్వము, అపవిత్రత, కాముకత్వము, విగ్రహారాధన, అభిచారము, ద్వేషములు, కలహములు, మత్సరములు, క్రొధములు, కక్షలు, భేదములు, విమతములు, అసూయలు, మత్తతులు, అల్లరితో కూడిన ఆటపాటలు అనునవి అన్నీ కూడా ప్రాచీన పురుషుని లక్షణాలు ఆత్మసంబంధమైన ప్రేమ, సంతోషము, సమాధానము, దీర్ఘశాంతము, దయాళుత్వము, మంచితనము, విశ్వాసము, సాత్వీకము, ఆశానిగ్రహము అనునవి క్రొత్త జీవితానికి సంబంధించినవి.

కాబట్టి క్రొత్తదనమును ఆశిస్తున్న ప్రియులందుకూడా తమ్మును తాము మోసపరచుకొనకుండా శరీర సంబంధమైన వాటి విషయం ఆసక్తి కనపరచకుండా ఆత్మ విషయమైన వాటియందు ఆసక్తి కలిగియుండవలెనని కొరుచున్నాను. అయితే చెప్పటం సులభము కాని ఆచరణ చాలా కష్టతరం అట్లని సమర్ధించుకునే మన వంటివారు వుంటారనే ప్రభువు ముందుగానే "మనుష్యులకు సాధ్యము కానిది దేవునికి సాధ్యము" అని సెలవిచ్చాడు.

నీళ్ళ మీద నడవడం ప్రపంచంలో ఎక్కడా ఎప్పుడు జరగనిది ప్రధాన శిష్యుడైన పేతురు కూడా నీళ్ళ మీద నడవాలని ప్రయత్నంచేసి మునిగాడు. ఎందుకంటే మనుష్యులకు అసాధ్యం సైన్స్‌కి విరోధం అయినప్పటికి యేసు సహాయంతో నడవగలిగాడు. అట్లాగే ఈ పాపలోకంలో ప్రాచీన పురుషుడు (సాతాను) తాండవిస్తున్న ఈ సమయంలో నూతన జీవనము క్రీస్తుతో సాధ్యమవు తుంది. దీనిని గురించి క్రొత్తనిబంధనలో పౌలుగారు. "కావున మునుపటి ప్రవర్తన విషయములోనైతే మోస కరమైన దురాశలవలన చెడిపోవు మీ ప్రాచీన స్వభావ మును వదులుకొని మీ చిత్తవృత్తి యందు నూతనపరచ బడినవారై నీతియు యదార్ధమైన భక్తియుగలవారై, దేవుని పోలికిగా సృష్టింపబడిన నవీన స్వభావమును ధరించుకొనవలెను". ఎఫెస్సీ 4:22-24.

"కావున భూమి మీదనున్న మీ అవయవములను అనగా జారత్వమును, అపవిత్రతను, కామాతురతను, దురాశను, విగ్రహారాధనమైన ధనాపేక్షను చంపివేయుడి. వాటివలన దేవుని ఉగ్రత అవిధేయులు మీదికి వచ్చును. పూర్వము వారి మధ్య జీవించినప్పుడు మీరును వీటిని అనుసరించి నడుచుకొంటిరి. ఇప్పుడైతే మీరు కోపము, ఆగ్రహము, దుష్టత్వము, దూషణ, మీ నోట బూతులు అనువాటినన్నిటిని విసర్జించుడి. ఒకనితో ఒకడు అబద్ధ మాడకుడి; ఏలయనగా ప్రాచీనస్వభావమును దాని క్రియలతో కూడ మీరు పరిత్యజించి, జ్ఞానము కలుగు నిమిత్తము దానిని సృష్టించినవాని పోలిక చొప్పున నూతన పరచబడుచున్న నవీనస్వభావమును ధరించుకొనియున్నారు". కొలస్సీ 3:5-10.

ఇక్కడ ముఖ్యంగా గమనించవలసిన విషయము ఎఫెసీయులు 4:23 వ వచనము మీ చిత్తవృత్తియందు నూతన పరచబడినవారై చిత్తవృత్తియందు అంటే చిత్ అంటే మనస్సు. మనస్సునందు నూతనపరచబడినవారై అనగా మారుమనస్సు పొందినవారై ఇంకా లోతుగా దీనిని తర్కిస్తే రూపాంతరము పొందినవారై అని అర్థం రూపాంతరం అంటే వేరే రూపం ధరించుకొనుట. దానినే పౌలుగారు రోమా 12:2లో మీ మనస్సు మారి నూతనమగుట వలన రూపాంతరం పొందుడి అని వ్రాస్తున్నాడు. రూపాంతరం పొందుట అనేదానికి సీతాకోకచిలుకే చక్కటి నిదర్శన. రూపాంతరం పొందక మునుపు దాని జీవితం గొంగళిపురుగు జీవితం ఈ గొంగళి పురుగు నాశనకారి అసహ్యమైన ఆకారం నేలమీద ప్రాకే జీవితము పంటలను పాడుచేసే గుణం. అయితే అది రూపాంతరము పొంది సీతాకోకచిలుక అయినప్పుడు ఎంతో సుందరమైన జీవితము మనుషులకు ఆనందం కలిగించే ఆకారము పంటలను అభివృద్ధిపరచే స్వభావము. అటువలే గొంగళిపురుగు వలె అసహ్యకరంగా వున్న మన జీవితములు మారుమనస్సుతో రూపాంతరము పొందిన తరువాత సీతాకోక చిలుకవలె క్రొత్త జీవితములో ప్రవేశించగలము. ఇప్పుడు మనము ఈ నూతనమైన జీవితములో అనేకమైన ఆశీర్వాదములు మనము కోరిన విధముగా పొందగలము (సశేషం)

## పాఠకులకు గమనిక

**'పరిశుద్ధత'** మాసపత్రికను మీరు ఎంతగానో ఆదరిస్తున్నందుకు మీకు మా హృదయపూర్వక కృతజ్ఞతలు. ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనప్పటికీ గత 20 సంవత్సరముల నుండి నడిపించగలగటం దేవుని కృప వలన మాత్రమే సాధ్యమవుతుంది. ఇప్పటి వరకు మేము సంవత్సర చందా విషయంలో పాఠకుల మీద ఎలాంటి వత్తిడి తీసుకురాలేదు. ఎందుకంటే ఈ మా సాహిత్యసేవలో మేము ఆత్మల రక్షణకే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చాము. అయితే పాఠకులు చందా కట్టడం ద్వారా ఈ మా పరిచర్యను ప్రోత్సహించాల్సిన బాధ్యత వారిపై ఉంది. నేడున్న పరిస్థితుల్లో పత్రిక సంవత్సర చందాను **150/-**, పోషకచందాను 1000/-, జీవితచందాను 3000/-లుగా పెంచటం జరిగింది. కావున పాఠకులు సహకరించి, పత్రిక అభివృద్ధికి చందాను కట్టవలసినదిగా కోరుచున్నాము.

# సుబుద్ధి



**శ్రీమతి కె. రేచల్ జోసఫ్,**
**హన్నా ఉమెన్స్ ప్రెసిడెంట్**

జ్ఞానియైన సొలోమోను స్త్రీని గురించి ఇచ్చిన సాక్ష్యము సుబుద్ధిగల భార్య యెహోవా యొక్క దానము సామెతలు 19:14. జ్ఞానవంతురాలు సుబుద్ధిగల స్త్రీ తన ఇల్లు కట్టును సామెతలు 14:1

ఆదామును చేసిన దేవుడు పురుషునికి సాటియైన సహాయము కొరకు స్త్రీని చేశారు. స్త్రీని ఆదామును చేసినట్లుగా మట్టితోటి చేయలేదు. ఆదాము నుండి తీసిన ప్రక్కటెముకుతో స్త్రీని నిర్మించారు. ప్రక్కటెముకతో చేయబడినందున పురుషునికి సహచర్యం కోసం సహవాసం కోసం పురుషునికి సాటియై నదిగా సృష్టింపబడినది. ఇంటికి దీపం ఇల్లాలే. దీపం లేని ఇల్లు చీకటి. దీపం జ్ఞానానికి సాదృశ్యం. ఇల్లాలికే జ్ఞానము లేకుంటే ఇల్లాలు ఉండి కూడ ఆ ఇల్లు చీకటి జ్ఞానంగల స్త్రీ ఇంటికి వెలుగైతే అజ్ఞానంగల స్త్రీ ఇంట్లో కలహాలు దుఃఖాలు సృష్టిస్తుంది. ఇంటికి దీపం ఇల్లాలుగా ఉండాలంటే జ్ఞానం కలిగివుండాలి. జ్ఞానమంటే క్రీస్తు. క్రీస్తుగల స్త్రీ దైవస్వభావం గల స్త్రీ తన ఇల్లు చక్కబెట్టుకుంటుంది. అటువంటి స్త్రీ తన భర్త పిల్లలు పనివారి చేతపొగడ బడుతుంది.

పరిశుద్ధ గ్రంథములో సముయేలు 25వ అధ్యా యంలో అటువంటి సుబుద్ధిగల స్త్రీని మనం చూడగలము. ఆమె పేరు అబీగయేలు. స్త్రీలందరికి ఆదర్శిమూర్తి. కుటుం బాలలో సహజంగా జరిగే అపాయకరమైన సంఘటనలు ఎలా ఎదుర్కోవాలి ఆ విషయాలలో అబీగయీలు ఆదర్శం. అబీగయీలు భర్త పేరు నాబాలు. నాబాలు మోటువాడు దుర్మార్గుడునై యుండెను.

దైవసేవకుడైన దావీదు అరణ్యములో ఉన్నపుడు కర్మెలులో నాబాలు ఉన్నాడని తెలిసికొని తన పనివారికి భోజనం పంపమని దావీదు వర్తమానం పంపినపుడు నాబాలు అవమానకరంగా మాట్లాడి వచ్చిన పనివారిని వట్టిచేతులతో పంపించి వేశాడు. నాబాలు మాటలకు దావీదు కోపించి తెల్లవారేలోగా నాబాలు కుటుంబములోగాని పనివారిలోగాని ఒక్క మగవాడైనా లేకుండా అందరిని వధించెదనను నాలుగువందలు మందితో కర్మెలునకు బయలుదేరాడు.

ఈ విషయం నాబాలు పనివాడు నేరుగా అబీగయీలుకు చెప్తాడు. అమ్మా మన యజమానుడు దైవసేవకుడైన దావీదు మహారాజును అవమానకరముగా మాట్లాడిన సంగతి విని మన యజమానునికి ఆయన ఇంటి వారికిని కీడుచేయ నిశ్చయించుకొని బయలుదేరియున్నాడు. కనుక నీవు చేయవలసిన దానిని బహు జాగ్రత్తగా ఆలోచించుము అని ఒక పశువుల కాపరి. తన యజమానురాలితో మాట్లాడగలిగాడంటే ఆ పని వాడు అబీగ యీలు స్వభావమెరిగిన వాడై ఉండాలి. ఒక రాజు తన యజ మానికి అపకారం చేయనున్నాడని ఎరిగిన దాసుడు యజమానితో చెప్పాలిగాని ఇంటి యజమానురాలితో చెప్పాడంటే ఆమె సుబుద్ధి గలదని ఎరిగాడన్నామాట. రాబోవు ఆపద గుర్తెరిగి జ్ఞానంగా ప్రవర్తించి ఆపదనుండి రక్షించగల తెలివితేటలు ఆమెకున్నాయని తెలిసి కోగలగాడు. గనుక అందుకే పరుగున వచ్చి అబీగయేలుకు చెప్పాడు. ప్రతి నిత్యం మనచుట్టు ఉండే ప్రజలు మనలను గమనిస్తునే వుంటారు. మనం మనక్రియల ద్వారా ప్రభువునే చూపించాలి. మన నడక చూపు మాట్లాడే తీరు ప్రవర్తన ప్రతి విషయంలోకూడ మనం ఏమైయున్నమో తెలిసికోగలరు. కనుక సుబుద్ధిగల స్త్రీవలె ప్రతి నిత్యం ప్రవర్తించాలి. ఇక్కడ అబీగయీలు మూఢుడైన తన భర్తకు లేనిపోనివి కల్పించి చెప్పి యుద్ధమునకు ప్రేరెపించలేదు. ఉగ్రుడైవస్తున్న దైవసేవకుడైన దావీదును సమాధానపర్చవలెనని దావీదుకు అతని పనివారికి కావలసివన్ని సిద్ధము చేసికొని దావీదునకు ఎదురేగి ఆయనకు సాష్టాంగ నమస్కారము చేసి అతని పాదములు పట్టుకొని తన భర్త చేసిన పాపము తనదిగా ఎంచుకొని రక్షింపమని కోరినది.

ఒక ధనవంతుని భార్యననిగాని అందగత్తెనని గర్వించక ఎంతో అణుకువగా తన్ను తాను తగ్గించుకొని దావీదు పాదములు పట్టుకొని నీ దాసురాలినైన నన్ను జ్ఞాపకం చేసుకొమ్మని బ్రతిమాలింది. తన భర్తకు రాజుకు మధ్య సమాధానం కోరింది. ఆ తర్వాత దావీదు మహారాజుకు భార్య అయ్యే యోగ్యత సంపాదించుకొన్నది. అట్టి సుబుద్ధిని ధైర్యమును జ్ఞానమును దేవుని పాదాలు ఆశ్రయించే సుబుద్ధి సుగుణములు ప్రభువు మనకు దయచేయును గాక.

# ఆత్మలు - క్రియలు

యోహా. 14:16 :- నేను నా తండ్రిని వేడుకొందును, మీ యొద్ద ఎల్లప్పుడు నుండుటకై ఆయన వేరొక ఆదరణ కర్తను అనగా సత్యస్వరూపియగు ఆత్మను మీకను గ్రహించును.

యేసుక్రీస్తు వారు శరీరధారిగా ఈ లోకానికి వచ్చి, 33 సం॥ సజీవునిగా ప్రజల మధ్యలో సంచరించి, 3 సం॥ సేవచేసి, యూదులు, రోమా అధికారుల చేత సిలువ వేయబడి, మృతిచెంది, సమాధి చేయబడి, తాను చెప్పిన రీతిగ 3వ దినమున మహిమ శరీరముతో పరలోకమునకు తిరిగి వెళ్ళినాడు. ఆయన సజీవునిగా వుండి సేవచేస్తున్న దినములలో కలవరంలోనున్న శిష్యులతో యేసు ప్రభువు వారు "ఆదరణకర్తను మీ యొద్ద ఎల్లప్పుడు వుండునట్లుగా పంపుతాను అని చెప్పి వారిని ధైర్యపరిచి, వారి విశ్వాసమును బలపర్చినారు.

1. ఆత్మను గూర్చిన కొన్ని నిజాలు తెలుసుకుందాము:- ఆత్మలు 3 రకాలుగా నున్నది:- 1.పరిశుద్ధాత్మ, 2.దురాత్మ, 3.భ్రమపర్చు ఆత్మ. ఈ ఆత్మలకు వాటి వాటి క్రియల ద్వారా మాత్రమే గుర్తించగలము.

**1. దురాత్మ:** దీనిని సాతాను ఆత్మ, దెయ్యపు ఆత్మ, క్రీస్తు విరోధి ఆత్మ అని కూడ పిలువ వచ్చును. ఇది దేవుని ఆత్మకు విరోధమైన ఆత్మ, దేవుని మాటను నమ్మదు, దేవుని ప్రకారం చేయదు, దేవునికి లోబడదు. ఇది దేవుని ఎదిరించు ఆత్మ, ఇది విశ్వాసులను మోసపర్చు ఆత్మ, దేవుని మార్గము గురించి ప్రజలను తప్పించే ఆత్మ. "ఎందుకనగా వీడు ఆదినుండి నరహంతకుడైయుండి సత్యమందు నిలిచిన వాడుకాదు. వానియందు సత్యములేదు, వాడు అబద్ధమాడు నప్పుడు తన స్వభావము ననుసరించియే మాటలాడును, వాడు అబద్ధికుడును, అబద్ధమునకు జనకుడనైయున్నాడు. యోహా. 8:44.

ఎ) దురాత్మ క్రియలు:-

1.మోసపరరచునది:- ఆది 3:1-5 అది తల్లియైన హవ్వను మోసపుచ్చినది. ఇది నిజమా?- అనుమానము కల్పించింది, మీరు చావనే చావరు, తప్పుడు బోధ చేసింది, దేవతలవలే వుందురు -లేని ఆశను కల్పించింది, ఆ పండు తింటే మీ కన్నులు తెరవబడతాయి - పండు తినడానికి ప్రోత్సాహపర్చింది - మోసపోయిన ఆదిపితురులు ఆ పండును తిన్నారు -దురాత్మ సాతాను చెప్పిన రీతిగా వారు శారీరకంగా చావలేదు బ్రతికివున్నారు గాని ఆత్మీయంగా చచ్చారు.

2. గర్వాన్ని తెచ్చిపెడుతుంది:- దురాత్మ వలన ప్రథమ స్వభావము గర్వము. సాతాను అనగా దేవుని దూతలలో ప్రధాన దూత. యెహెజ్కేలు 28:14-16, యెషయ 14:12 భాగములలో ఈ దూతకివ్వబడిన ఆధిక్యత, తాను గర్వించిన విధానము పరలోకము నుండి భూమిపైకి పడి ద్రోయబడిన విధానము తెలియనగును.

2 దినవృత్తాంతములు 26:3-16 వరకు భాగములో ఉజ్జియా రాజు చరిత్రను ఉదహరణగ చూడవచ్చును. 26:5లో అతడు యెహోవాను ఆశ్రయించినంత కాలము దేవుడు అతనిని వర్ధిల్లచేసెను. 26:16లో అతడు స్థిరపడిన తరువాత తన మనస్సున గర్వించి చెడిపోయెను. గర్వము అనేది దురాత్మల యొక్క ప్రభావముగా గుర్తించాలి.

3. కామాతురత:- 1రాజు 3:9-14లో సొలొమోను దేవుని దగ్గర అడిగిపొందిన వరమును మనము చూడగలము. నీ దాసుడనైన నాకు వివేకముగల హృదయము దయ చేయుము. దేవుడైన యెహోవా సొలొమోను యొక్క కోరికను మన్నించి అతనికంటే ముందుగాని, అతని వెనుక వచ్చు తరములలోగాని ఎవరికి అందనంత జ్ఞాన వివేక ములు దయచేసినాడు. అయితే ఇతనిలోని కామా తురత

ఇతనిని తరిమిపట్టుకొనినది, ఇతనికి ఏడువందల మంది భార్యలు, 300 వందల మంది ఉపపత్నులు కలిగి యున్నాడు. అతని భార్యలు అతని మనస్సును త్రిప్పివేయగా అతడు అష్టారోతు అను సీదోనీయులు దేవతను, మిల్కోము అను అమ్మోనీయుల దేవతలను పూజించుట ప్రారంభించెను. కెమోషు, మొలెకు అన్య హేయమైన దేవతలకు బలిపీఠములు కట్టిన వాడాయెను (1రాజు 11:1-8లో చూడుము) చివరకు వ్యర్థుడై ప్రసంగిలో సమస్తము వ్యర్థమని వ్రాశాడు.

4. రోగాలు తెచ్చిపెడతాయి : మత్త. 8:16 సాయంకాలమైనప్పుడు జనులు దయ్యములు పట్టిన వారిని అనేకులను ఆయన యొద్దకు తెచ్చిరి. ఆయన మాట వలన దయ్యములను వెళ్లగొట్టి రోగులను స్వస్థపరచెను.

ఎ) మత్త. 8:28 గదరేనియ దేశమందు దయ్యము పట్టిన ఇద్దరు మనుష్యులలోనున్న దయ్యములను పారద్రోలగ అవి సమీప ప్రాంతమందు మేత మేయుచున్న పందులలో ప్రవేశింపగా 2000 సంఖ్యగల పందులు పరుగిడిపోయి నీటిలో మునిగి చచ్చిపోయినవి. దయ్యము పట్టినవారు స్వస్థత పొందిరి.

బి) మత్త. 17:14-23 వాక్య భాగములో - దయ్యము తెచ్చిపెట్టిన చాంద్ర రోగి యొక్క ఉదంతము చూస్తాము. వాడు అపాయకరమైన నీటిలోను, అగ్నిలోను పడి చావడానికి ప్రయత్నం చేసాడు. అట్టివానిని ప్రభువు దగ్గరకు తెచ్చినారు. 17:18 యేసు ఆ దయ్యమును గద్దింపగా అది వానిని వదలిపోయెను. వాడు స్వస్థత పొందెను.

దురాత్మలు ఇలా అనేక విధాలుగా దేవుని బిడ్డలను చెరపట్టి వారిని శాపగ్రస్తులుగా మారుస్తుంది. దేవునికి దూరస్తులనుగా మారుస్తుంది. కుటుంబాలలో ఐక్యతను చెడగొడుతుంది. భార్యభర్తులు పిల్లలు మధ్య అనైక్యత, సంఘములలో అనైక్యత సహోదర ప్రేమ గలిగి ఒకరి కొరకై ఒకరు ప్రాణము పెట్టవలసిన క్రైస్తవ నీతి ప్రాణములను తారుమారుగా మార్చేస్తుంది. యిట్టి దురాత్మల కొరకు నరకము భద్రము చేయబడుతున్నాయి. సత్యమును మనము గ్రహించవలెను. ఈ దురాత్మ లోకమంతట వుంది. దీనిని ఒంటరిగా జయించుట విశ్వాసికి కూడా అంత తేలిక కాదుగాని, యేసుప్రభువు వారు చెప్పిన గొప్ప మాటను జ్ఞాపకము తెచ్చుకొందాము. ఏంటి అది - నేను లోకమును జయించియున్నాను. మీలోనున్నవాడు లోకములో నున్నవానికంటే గొప్పవాడు. 1యోహా 4:4.

యేసుప్రభువు వారు చెప్పిన పై మాటలను ఆధారము చేసుకొని బ్రతుకుదాము. యాకోబు 4:7 ప్రకారము దేవునికి లోబడియుండుడి అపవాదిని ఎదిరించుడి అప్పుడు వాడు మీయొద్ద నుండి పారిపోవును. దురాత్మలను యేసు నామములో గద్దిద్దాము మనలను, మన కుటుంబాలను, మన సంఘాలను, సమాజమును బాగు చేసుకుందాము. దురాత్మకు ఒక్కసారి మన జీవితములోనికి రావడానికి అవకాశమిస్తే, అది మనలను పరిపాలన చేస్తుంది. విశ్వాసి దురాత్మకు బానిస అయిపోతాడు. దాని బంధకములలో నుండి బయటకు రావడం కూడా చాలాకష్టం అవుతుంది. మహాజ్ఞానియైన సొలొమోను సహితము ఈ దురాత్మల ద్వారా పీడింపబడినవాడై, దేవునికి దూరస్థుడై, హీనస్థితికి వచ్చిన తరువాత ప్రసంగి 12:13లో ఇదంతయు వినిన తరువాత తేలిన ఫలితం మిదే. దేవునియందు భయభక్తులు కలిగియుండి, ఆయన కట్టడలను అనుసరించుచుండవలెను. మానవ కోటికి యిదియే విధి.

ఈ దురాత్మ ఒక మనిషిలో శాశ్వితంగా నిలిచివుండే ఆత్మ. దీని ప్రభావము దైనందిన జీవితములో సదరు వ్యక్తినందు స్పష్టముగా కనిపిస్తుంది. అది నడిపించే విధానము చూద్దాము.

ఎ) దుఃఖములో, విచారములో వున్న వారితో ఇలా మాట్లాడుతుంది:- బాగా ఈ బాధను మర్చిపొమ్మని ప్రోత్సిహిస్తుంది.

బి) అవసరతలో - అబద్ధమాడటానికి మోసము చేయడానికి ప్రోత్సాహిస్తుంది, దొంగతనం కూడ.

సి) పగ - ద్వేషములో - ఎదుటివానిని కొట్టమంటుంది లేక చంపి పగ తీర్చుకోమని చెబుతుంది.

డి) ఒంటరితనంలో – సినిమా హాలుకు వెళ్ళమంటుంది, వేశ్యల దగ్గరకు వెళ్ళమంటుంది, జూదం ఆడమంటుంది. మరేదైన చెడు చేయమంటుంది. దేవుని వాక్యాన్ని చదవమనికాని, ప్రార్ధన చేయమనికాని, సంఘంలో ఆరాధనకు వెళ్ళమనిగాని యిది ప్రోత్సాహించదు.

ఇ) మంచివానితో – ఎందుకు ఇలా వున్నావు లోకాన్ని చూడు అందరూ ఎంత సంతోషంగా వున్నారో నీవు ఎందుకు ఏది లేకుండ వుంటావు. లోకంలోకి వెళ్ళు ఏదొకటి చెయ్యి అని ప్రోత్సాహిస్తుంది. జాగ్రత్త.

ప్రియ చదువరీ, నీ వ్యక్తిగత జీవితములో పై చెప్పిన అంశములు ఏవైన ప్రభావము చూపిస్తూ వుంటే, నీవు దురాత్మ పాలన క్రింద ఉన్నావని గ్రహించి, దానిని విడిచి దేవుని యొద్దకు రావడానికి ప్రయత్నము చేయుము. ఆయన యొద్దకు వచ్చు వారిని ఆయన ఎన్నడు త్రోసిపుచ్చేవాడు కాదు. నిన్ను త్రోసి పుచ్చడు. నీ కొరకు నా కొరకు సిలువలో చూపిన చేతులు ఇంకా అలాగే ఎదురు చూస్తున్నవి.

**2. భ్రమపరచు ఆత్మలు:** ఆదిలోను అంతములోను ఈ ఆత్మలు లేవు వుండవు. ఇవి సమాజంలోనికి మధ్యలో వచ్చి చేరినవి. ఇవి ఒక వ్యక్తిపై శాశ్వితంగా నిలిచి వుండేవి కావు. ఆయా సమయాలలో వచ్చి వెళ్ళేదిగా వుంటుంది. భ్రమపర్చు ఈ ఆత్మలు అటు దురాత్మ, యొక్క ప్రభావమును కలిగివుంటవి. లోకములో వున్నప్పుడు ఆయా సందర్భము లలో పండగల, సంబరాల మధ్యలో ఒళ్ళు పొంగడము, పూనకం, ఊగడము, ఏవేవో మాట్లాడటం మొదలగు Extra ordinary activities, విపరితమైన క్రియలు ఆ వ్యక్తి చేయడం మనము గమనిస్తూనే వున్నాము. అదే వ్యక్తి క్రైస్తవ ప్రార్ధన మందిరములో పాటలకు, సంగీత పరికరములకు, అరుపులకు ప్రభావితము చెంది ఇక్కడ కూడ కేకలు వేయడం, ఎగరడం మొదలైన విపరీత క్రియలు చేస్తాయి. ఈరెండు సందర్భలలోను ఆ వ్యక్తి క్రియ ఒకటిగానే వుంది. అందువలన దురాత్మఅనిగాని, పరిశుద్ధాత్మఅనిగాని మనము విడదీసి చెప్పుట సాధ్యము కాదు. అయితే, ఆ వాతావరణములో నుండి బయటకు వచ్చిన తరువాత సదరు వ్యక్తి యొక్క క్రియలు, నడవడిక, ప్రార్ధన జీవితమునుబట్టి ఆమె పొందినది పరిశుద్ధాత్మ లేక దురాత్మ లేక భ్రమపర్చు ఆత్మ అనేది గుర్తించ వచ్చును. పాతనిబంధన కాలములో దేవుని సేవకుడైన మోషే చేసిన అద్భుతములకు వ్యతిరేకంగా ఐగుప్తు మాంత్రికులు, శకునగాండ్రు చేసిన వన్నియు. అలాగే దానియేలు కాలమందు బబులోను దేశములోని గారడి విద్యగలవారు మొదలగు జ్ఞానులు చేసినవి, సౌలు కాలములో దేశ బహిష్కరణకు గురియైన కర్ణపిశాచం ఇవి అన్నియు, దురాత్మల సమూహములకు లేక భ్రమపర్చు ఆత్మలకు సాదృశ్యములుగా నున్నది.

**3. పరిశుద్ధాత్మ దేవుడు**

యోహాను సువార్త 14:16వ వచనం ప్రకారము దేవుని బిడ్డలకు దేవుడు వాగ్దానం చేసిన ఆత్మను పరిశుద్ధాత్మ. పరిశుద్ధాత్మ ఒక ప్రత్యేకమైన భాగము కాదుకాని దైవత్వము, అనగా త్రిత్వమైయున్న దేవునిలోని భాగము. దేవుడు త్రిత్వమై యున్నాడు. తండ్రి కుమార పరిశుద్ధాత్మ మూడు అంశములు ఏకమైనదే దైవము పోలిక.

**ఎ) పరిశుద్ధాత్మకుగల ఇతర నామములు**

1. పరిశుద్ధాత్మ – యోహా. 14:26 అపొ.కా 1:8.
2. ఆదరణకర్త – యోహా. 14:16
3. సత్యస్వరూపి అగు ఆత్మ – యోహా. 14:16
4. నిత్యుడగు ఆత్మ – హెబ్రీ. 9:14
5. దేవుని ఆత్మ – ఆది. 1:2
6. యెహోవా ఆత్మ – యెషయా 11:2, న్యాయాధి 11:29
7. ఉత్తరవాది – యోహా. 14:26

ఆది 1:1లో వ్రాయబడిన మాట ఆదియందు దేవుడు. దేవుడు ఆదిలోనే వున్నాడను భావమును యిస్తున్నందున, పరిశుద్ధాత్మ కూడ ఆదిలోనే ఆయన (దేవునితో) ఉన్నాడని భావించదగును. దీనిని బట్టి పరిశుద్ధాత్మకు పూర్వపు ఉనికి (pre-existence) గలదని చెప్ప వీలవుతుంది.

**(సశేషం)**

# దుఃఖ దినములు సమాప్తమాయెను



శ్రీమతి మాధురి మరియన్

క్రీస్తునందు మిక్కిలి ప్రియమైన పరిశుద్ధత మాస పత్రిక ప్రియులందరికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియ జేయుచున్నాము. బాగున్నారా మీకోసం ప్రతి దినము మేము ప్రార్థిస్తున్నాము. మీరు ఎపుడు ప్రభునందు బహుగా ఆనందిం చాలని మనస్ఫూర్తిగా కోరుకొనుచున్నాము.

యెషయా 60:19లో వున్న మాటలను మనం ధ్యానించుకుందాము "ఇక మీదట పగలు సూర్యుని ప్రకాశము నీకు వెలుగుగా ఉండదు నీకు వెలుగిచ్చుటకై చంద్రుడు ఇకను ప్రకాశింపడు యెహోవాయే నీకు నిత్యమైన వెలుగుగా వుండును. చాలాసార్లు మనం చీకటిలో వున్నట్లు గానే వుంటాము ఎంతో వెలుతురు వస్తున్నప్పటికి, ఎన్ని లైట్లు వెసియున్నప్పటికి మనం చీకటి అనే బంధకంలో నిరాశ, అపజయము, అభివృద్ధిలేని జీవితం, ఎదుగుదల లేనట్లుగా ఎంతగా ప్రార్థించినా ఫలితం పొందకుండా వున్నట్లుగా చూస్తుంటాము. కాని ప్రభువు ఈ రోజు ఈ సం॥రము మనకు ఇస్తున్న మాట ఏమిటంటే ఈ లోకపు వెలుతురు నీకు అవసరం లేదు, సూర్యుడు గాని చంద్రుడు గాని కాంతిని ఇవ్వకపోయిన పర్వాలేదు కాని ఇకను నీకు నిత్యమైన వెలుగు ఇవ్వడానికి నిన్ను సంతోషపరచడానికి దేవుడే నీకు నిత్యమైన వెలుగుగా వుండబోతున్నాడు. చెప్పశక్యముగాని ఆనందాన్ని నీకు దేవుడు కల్పిస్తున్నాడు. ఇక చీకటి నీ బ్రతుకులో వుండదు. ఎటుచూసినా వెలుతురే నీకు కనుబడుతుంది. దేవుడు నీ కొరకు మూయబడిన ద్వారములన్ని తెరుస్తున్నాడు నలుదిశల నుండి నీకు సమృధిగా వెలుగు నీ జీవితములో, గృహములో, కుటుంబములో, సేవ పరచర్యలో వ్యాప్తిచెందించును. నీ సూర్యుడికను అస్తమింపడు నీ చంద్రుడు క్షీణింపడు యెహోవాయే నీకు నిత్యమైన వెలుగుగా వుండును. నీ మనసు దేవుని మీదనే వుంచుము.

నీ దుఃఖ దినములు సమాప్తములగును. ఇంత కాలము నీవు ఎంతగానో రోధించియుంటావు ఎన్నో మాటలు అవమానములు, నిందలు ఎన్నోమార్లు చాటుగా ఏడ్చి వుంటావు ఎంతోమంది నిన్ను నోటి మాటలతో బాధపెట్టి వుంటారు. అయితే ప్రభువు మనకు ఇస్తున్న వాగ్దానం నీ దుఃఖ దినములు సమాప్తములగును. అధికమైన సంతోష ములు నీకు కలుగును. నీకు దూరమైన వారందరు నీకు ప్రియమైన వారగుదురు, నీ శత్రువులు మిత్రులుగా మారు దురు, సిగ్గును అవమానమును దేవుడు కొట్టివేయును. నీ ఇంట్లో మరణపు వేదనలు నిట్టూర్పులు ఎగిరిపోవును, నిత్యా నందము మీ తలలపై వుండును, యాకోబు దేవుడు నీకు బలముగా నుండును, నీ ఇంటి వారందరు సంతోషముగా వుంటారు. సంబరము, నాట్యములు సంగీతము నీ ఇంటిలో వుండును. నీ వేదన అంతా ఆయన తీసివేసి నీకు నిత్యమైన సంతోషము దయచేయును. నీవు ఒంటరివిగావు బలమైన జనముగా వుందువు. ఎన్నికలేని నీవు తృణీకరించబడిన నీవు బలమైన జనముగా ఆయన నిన్ను మార్చబోవుచున్నాడు.

ప్రభుత్వములు నీ కొరకు మంచి పథకములు రూపించ బోతున్నది, నిరుద్యోగులకు ఉద్యోగములు, గృహములు లేని వారికి గృహములు, ఆరోగ్యశ్రీ కార్డులు ఇలా ఎన్నో మంచి పథకములు మనకు దేవుని ద్వారా అందించబడపోవుచున్నవి. ఇవన్ని జరుగవలెనని దేవుడు కోరుచున్నాడు. ఇశ్రాయేలు కుమారీ జయగీతమెత్తుము ఇదిగో నీ రాజు నీ ప్రభువు నిన్ను ఆశీర్వదించుటకు రాబోవుచున్నాడు. మీ తలలు పై కెత్తుడి "యెహోవానగు నేను తగిన కాలమున ఈ కార్యమును త్వరపెట్టుదును" అని యెషయా 60:22లో సెలవిస్తున్నాడు.

కనుక దుఃఖదినములు సమాప్తమాయెను. నీకు యెహోవా నిత్యమైన వెలుగుగా వుంటున్నాడు. నీవు ఎన్నిక లేనివాడివి కాదు. నిన్ను బలమైన జనముగా ఆయన చేయు చున్నాడు. ఆమెన్.

ప్రభువు మిమ్మును ఈ నూతన సంవత్సరములో బహుగా ఆశీర్వదించునుగాక!

# ఆఖరి తిరుగుబాటు


బ్రదర్ కె.సామ్రాట్

మానవ చరిత్రలోనే అత్యంత సుభిక్షమైన కాలం ప్రభువైన యేసుక్రీస్తు వెయ్యేండ్ల పాలన. ఈ పాలనలో ప్రవేశించు వారెవరనగా పాత నిబంధన కాలములోని నీతిమంతులు, ఏడేండ్ల శ్రమల కాలంలో క్రీస్తువిరోధిని ధిక్కరించి ప్రభువైన యేసునందు విశ్వాసముంచిన వారు మరియు ప్రభువైన యేసుక్రీస్తుతో భూమికిపైగా దిగివచ్చిన క్రొత్త నిబంధన విశ్వాసులు. భూమిమీద ఇంతకు ముందెన్నడూలేని సంపద, సమృద్ధి, సంతోషం, ఆరోగ్యం వెయ్యేళ్ళ పాలనలో వెల్లివిరుస్తాయి. కాబట్టి ఆ కాలములో ప్రపంచ జనాభా గణనీయంగా వృద్ధిచెందుతుంది. అసంఖ్యాకంగా విస్తరించిన ఈ ప్రజలకు క్రీస్తు సువార్త చెప్పే భాగ్యం ఇశ్రాయేలీయులకు దక్కుతుంది. కావున, పూర్వం ప్రపంచ జనులందరికీ వెలుగుగా ఉండవలెనని దేవుడు ఇశ్రాయేలీయులకు నిర్దేశించిన ప్రణాళిక వెయ్యేండ్ల పాలన కాలములో పూర్ణసిద్ధి పొందుతుంది. సాతానుడు బంధించిబడి ఉంటాడు. కాబట్టి, వెయ్యేళ్ల పాలన కాలములో సాతాను ప్రభావం ప్రజలపై ఉండదు.

అయితే, వెయ్యేళ్ళ పాలనా కాలములోకూడా చాలా మంది ప్రజలు తమ హృదయములలో దేవుని ద్వేషిస్తారు. క్రీస్తు సువార్తను వారు విశ్వసించరు. ఆ కాలములో ఉన్న సంపద, సుఖ సంతోషాలు, పెరిగిన జీవన ప్రమాణాలు, ఆర్థిక పరిస్థితులవల్ల వారి హృదయాలు క్రొవ్వెక్కు తాయి. ప్రపంచ చరిత్రలో ఈలాంటి ప్రవర్తన పదేపదే పునరావృతమవడం గమనార్హం. పూర్వం సొదొమ, గొమొఱ్ఱాలు తమకు ఎంతో ఆహార సమృద్ధి, నిర్విచారమైన సుఖస్థితి కలిగినప్పుడు దేవుని విసర్జించాయి. (యెహెజ్కేలు 16:49). దేవుడు ఇశ్రాయేలీయులను పాలు, తేనెలు ప్రవహించు సౌభాగ్యవంతమైన దేశములో ఉంచిన తర్వాత వారు ధనికులై దేవుని మార్గమును విడిచి అన్య దేవతలవైపు తొలగిపోయారు. ఆధునిక కాలములోకూడా క్రైస్తవ్యము వలన ఎంతో గణనీయమైన అభివృద్ధిని సాధించిన యూరప్, అమెరికా దేశాలు తమ సాంఘిక సంస్థలనుండి బైబిల్‌ను బహిష్కరించి, యేసుప్రభువును తృణీకరించాయి. ఈ దుష్ప్రవర్తనే వెయ్యేళ్ళ పాలనలోకూడా పునరావృతమవుతుంది. బహిర్గతంగా శాంతి, సౌభాగ్యాలు అనుభవిస్తున్న ప్రజలు హృదయములో మాత్రం క్రీస్తును, ఆయన సిలువవలననైన విమోచనను తృణీకరిస్తారు.

ప్రపంచ చరిత్రలో ఆదర్శవంతమైన సమాజాన్ని చాలామంది కోరుకున్నారు. అయితే, వారు క్రీస్తు సిలువను మాత్రం తృణీకరించారు. మహమ్మద్, ఖురాన్, ఇస్లాం మతం సిలువను తీవ్రంగా వ్యతిరేకించాయి. మహాత్మా గాంధీ 'క్రీస్తు సిలువకు విమోచించే బలం లేదు' అని తన "సత్యంతో చేసిన ప్రయోగాలు" అనే స్వీయ జీవిత చరిత్రలో వ్రాశాడు. వారు సిలువను విమర్శించడం ఆశ్చర్యం గొలిపే సంగతేమీ కాదు. క్రీస్తు సిలువ మనుష్యుని "మహాత్ముడు" అని పిలువక "పాపి" అని పిలుస్తుంది. మనుష్యుడు స్వతహాగా పాపి కాబట్టి అతడు విమోచించబడాలని సిలువ ఆజ్ఞాపిస్తుంది. ఆఖరికి వెయ్యేళ్ళ పాలనలో యేసుప్రభువు మేలులు పొందిన ప్రజలుకూడా ఆయన సిలువపట్ల హృదయంలో విముఖతను పెంచుకొంటారు.

**వెయ్యేళ్ళ పాలన తరువాత సాతాను విడుదల**

"వెయ్యి సంవత్సరములు గడిచిన తరువాత సాతాను తానున్న చెరలో నుండి విడిపింపబడును. భూమి నలుదిశల యందుండు జనములను, లెక్కకు సముద్రపు ఇసుకవలె ఉన్న గోగు, మాగోగు అనువారిని మోసపరచి వారిని యుద్ధమునకు పోగుచేయుటకై వాడు బయలుదేరును",

(ప్రకటన 20:7,8). వెయ్యేళ్ళ పాలన తరువాత సాతాను తానున్న చెరలోనుండి విడిపించబడతాడు. యేసుప్రభువు పాలన క్రింద బహిర్గతంగా అప్పటివరకు అణగిమణిగి ఉన్న సిలువ ద్వేషులు సాతానుకు సుస్వాగతం పలుకుతారు. యేసు ప్రభువు పాలనలో ఆయన మేలులను సాదరంగా సుస్వా గతం చవిచూచినవారు, సాతానుతో జతకట్టారంటే వారి హృదయంలో ప్రభువుపట్ల కృతజ్ఞత ఏమాత్రం లేదని అర్ధమవుతోంది.

వీరు సాతానుతో కలిసి పరిశుద్ధుల శిబిరముగానున్న ప్రియమైన యెరూషలేమును ముట్టడివేస్తారు.

**దిగివచ్చి దహించివేయు అగ్ని**

సాతానుతో జతకట్టి దేవుని పట్టణాన్ని ముట్టడివేయు ప్రజలను దేవుడు శిక్షిస్తాడు. ఇంతకుముందు ఏడేండ్ల శ్రమల కాలంలో మాదిరిగా క్రమక్రమంగా శిక్షించక దేవుడు వీరిని ఒక్కసారే పరలోకములోనుండి అగ్నిని పంపి దహించివేస్తాడు. (ప్రకటన 20:9). వారిని మోసపరచిన సాతానుడు అగ్ని గంధకములుగల గుండములో పడవేయ బడతాడు. ప్రపంచ చరిత్రలో దేవునిపై జరుగు ఆఖరి తిరుగుబాటు ఆ విధంగా ముగుస్తుంది.

**మనుష్యుడు ఎలా మంచివాడవుతాడు?**

ఈ ప్రపంచంలో శాంతి, సౌభాగ్యాలు విస్తరిస్తే మనుష్యులు మంచివారైపోతారని చాలామంది సాంఘిక శాస్త్రవేత్తలు సిద్ధాంతాలు రూపొందించారు. అయితే, అటువంటి భావనలు కేవలం అపోహలని ఆఖరి తిరుగు బాటు మనకు తెలియజేస్తుంది. ముందెన్నడూ లేని శాంతి, సౌభాగ్యాలతో విలసిల్లు యేసుప్రభువు వెయ్యేళ్ళ పాలనలోని ఆదర్శవంతమైన సమాజంలో జీవించిన ప్రజలు దేవునిపై తిరుగుబడుట చూస్తే అది మనకు అర్ధమవుతుంది. "హృదయము అన్నిటికంటె మోసకరమైనది, అది ఘోరమైన వ్యాధి కలది" అను బైబిలు సత్యము (యిర్మీయా 17:9) అప్పుడు మరోసారి ఋజువవుతుంది.

**మనుష్యుడు ఎలా విమోచించబడతాడు?**

అత్యంత ఆదర్శనీయమైన పరిస్థితులు కూడా మనుష్యుని హృదయంలోని చెడుతనాన్ని నివారించలేవు. వెయ్యేళ్ళ యేసుప్రభువు పాలనలో సుఖశాంతులు అనుభ వించిన వారు కూడా దేవునిపై తిరుగబడుటలో మనకు అర్ధమయ్యే సత్యమిదే. అయితే, ప్రభువైన యేసుక్రీస్తు యొక్క సిలువ ద్వారా మాత్రమే మనుష్యుడు విమోచించబడగలడు.

## నూతన సంవత్సర శుభాకాంక్షలు

క్రీస్తునందు ప్రియపాఠకులందరికీ ప్రియ రక్షకుడునైన యేసుక్రీస్తు నామములో అందరికీ వందనములు.

2014 సంవత్సరంలో దేవుడు తోడైయుండి అన్నీ విషయములలో మనతో ఉండి నడిపించినందుకు దేవదేవునికి కృతజ్ఞతలు. ఈ సంవత్సరమునకు **"ఇమ్మానుయేల్"** అని నామకరణము చేసియున్నాము. ఇమ్మానుయేల్ అనగా 'దేవుడు మనకు తోడు' అని అర్ధము. ఎన్నో సంవత్సరములు గడచిపోయెను. ఎన్నో నూతనమైన విషయాలు ప్రపంచంలో జరుగుచున్నవి గాని మన నిజ జీవితములో ఏదైనా నూతన క్రియ జరుగుచున్నదా?. యెషయా 33:18లో చెప్పినట్లు 'ఇదిగో నేనొక నూతన క్రియను చేయుచున్నాను' పూర్వపు వాటిని జ్ఞాపకము చేసుకొనకుడి. 2కొరింథీ.5:17, పాతవి గతించెను, సమస్తమును నూతనమైనవి. క్రీస్తుయేసునందు వారు నూతన సృష్టి . దేవునిలో ఉన్నప్పుడు నూతన సృష్టి. యోహాను 3:3. ఒకడు క్రొత్తగా జన్మించితేనే కాని అతడు దేవుని రాజ్యము చూడలేడు. ఇక్కడ యేసుక్రీస్తు వారు చెప్పింది ఏమిటంటే మార్పు అనేది నీ లోపల జరిగే క్రియ అంతేకాని పండగకో, ఆదివారమో జరిగేది కాదు. హృదయపూర్వకంగా కలగాలి. దేవుడు నీలో నూతన క్రియ చేయటానికి నీవు సిద్ధముగా ఉన్నావా లేదా? ఉంటే ప్రార్ధించి క్రీస్తును నీలోనికి ఆహ్వానించు. దేవుడు చేసే ఆశ్చర్యక్రియలు చూడు, దేవునితో సంతోషంచు. దేవుడు మీకు తోడైయుండును గాక!

మీ **కొడవటికంటి సామ్రాట్**

# తెలుగుదేశం - క్రైస్తవ్యం

## (సమీక్ష)



డా. కె.విక్రాంత్

పరిశుద్ధత పాఠకులకు ప్రభువైన యేసు నామమున శుభాభివందనాలు.

చంద్రగిరిని కేంద్రముగా చేసికొని వెంకటపతి రాయలు పరిపాలించెడి దినములలో అనగా 1597 లో మొట్టమొదటి జెసూట్ మిషనెరీలు తెలుగు గడ్డపై కాలు మోపిరి. ఈ ఆస్థానములో వారు పద్దెనిమిది సంవత్సరాలు అలంకార ప్రాయలుగా ఉన్నారేగాని, వారి ఉనికి ఎవరిని ప్రభావితము చేయలేకపోయెను. ఆ పిదప 1616లో వారు గోవాకు తరలిపోయారు.

1701 లో ఫాదర్ మాండ్యిట్ చిత్తూరి జిల్లాలోని పుంగనూరులో సంపన్నమైన రెండు వెల కుటుంబాలకు క్రైస్తవ్యం ప్రసాదించి తెలుగు దేశంలో తొలిగా క్రైస్తవ సంఘ స్థాపనగావించిరి. తెలుగుదేశంలో వీరే ప్రథమ క్రైస్తవులన వచ్చును. కొంతకాలమువరకు పుంగనూరు క్రైస్తవ కేంద్రంగా విరాజిల్లి, వెంకటగిరి రాజా బంధు వర్గములో కొందరు క్రైస్తవులైనట్లు ప్రతీతి. కాని వారి వివరాలు తెలియరావడం లేదని ఆంధ్ర విజ్ఞాన సర్వస్వం 3వ సంపుటి సంకలనకర్తలు అభిప్రాయపడుచున్నారు.

ఆ పిదప 1709 లో చిక్కబళ్ళాపురంలో మొదట కొన్ని కుటుంబాలు క్రైస్తవ్యాన్ని స్వీకరించాయి. అక్కడ దేవాలయ నిర్మాణానంతరం దేహనగళ్ళి, కృష్ణా పురంవరకు ప్రాకి, అక్కడ నుండి, చిత్తూరు జిల్లా వాయల్పాడు వరకు, తరువాత కడప మండలంలోని సిద్ధపడంవరకు సంఘము వ్యాపించినది. మాది గుబ్బని వాసి, తుమ్మరాయవరెడ్డి దీర్ఘ రుగ్మతకులోనై 1715లో కృష్ణాపురం కేంద్రముగా చేసుకొని, సువార్తోద్య మమునా కొనసాగిస్తున్న ఫాదర్‌వీక్‌ను సందర్శించి, వారి ప్రార్థన దీవెనలనొంది, కొంతకాలానికి పూర్ణ ఆరోగ్యవంతులై 1720లో క్రైస్తవ్య దీక్షను గైకొన్నారు. ఇట్లు వ్యాపిస్తున్న సంఘము అలమూరుక్కడ చేరింది. అక్కడగల రెడ్డి కులస్థులు క్రీస్తునంగీకరించి, క్రైస్తవ ఆచారాలను ఆడంబరముగా జరిగించుట ప్రారంభించిరి. క్రైస్తవ సంఘము బాల్యారిష్టాల నదిగ యింపకమునుపే మహా రాష్ట్రానికి చెందిన సర్దారొకడు ఈ గ్రామమును దోచుకోడానికి ప్రయత్నించినందువలన అల్ప సంఖ్యాకులుగా ఉన్నక్రైస్తవులు చెల్లాచెదురై, పరారై, తూపాటిసీమ (నేటి ప్రకాశం జిల్లా) లోని దర్శి తాలుకా బుక్కాపురానికి వలస పోవలసి వచ్చెను. ఈ విధంగా వలస వెళ్ళినవారి జీవితం, ఆచార వ్యవహారాలు అచ్చటి గ్రామస్తుల నాకర్షించిన ఫలితంగా అక్కడ కూడ క్రైస్తవ సంఘానికి అంకురార్పగా జరిగినది. ఈ పరిణామం క్రొత్త స్థలములో సంఘ వ్యాప్తికి తోడ్పడెను.

1750లో పోలవరపు చిన్నయ్య రెవెన్యూ ఉద్యోగిగా ఉండి, కొంతకాలాని ఉద్యోగ విరమణ గావించి నర్సరావు పేటకు సమీపానగల రాలిపాడు వచ్చి, స్థిరపడి, అక్కడ వాక్యపరిచర్య జరిగించగా అనేక మంది కమ్మవారు క్రైస్తవ్యం స్వీకరించారు. బందరుకు, పుదుచ్చేరికి ఉన్న సంబంధము, రాకపోకలవలన, బందరు క్రైస్తవ కేంద్రమైనది.

ఇక 19వ శతాబ్ధములో ప్రపంచ వ్యాప్తంగా తలెత్తిన మాహోజ్జీవం ఫలితంగా అమెరికా యూరఫ్ దేశాలనుంచి కొన్ని క్రైస్తవ సంస్థలు ఆధునిక విధానాలు చేబూని ప్రపంచం నలుమూలలకు వెళ్ళి తమ కార్యక్రమాలు కొనసాగించాయి. కడప విశాఖపట్టణం, నర్సాపురం, గుంటూరు, నెల్లూరు, నంద్యాల అప్పటి నిజాం పాలనలోని జంటనగరాలు మరికొన్ని ప్రాంతాలలో క్రీస్తు సువార్త వ్యాప్తి చెందింది.

**...మిగతా 23వ పేజిలో**

# ప్రభువైన యేసుక్రీస్తు జీవితము మరియు పరిచర్య



శ్రీమతి రిబ్కా విక్రాంత్

1. ప్రభువైన యేసుక్రీస్తు జననము. లూకా 2:1-7.
2. యేసుపుట్టిన 8 రోజుల తరువాత సున్నతి చేయబడి, పేరుపెట్టబడుట. లూకా 2:21.
3. జన్మించిన 40 రోజుల తరువాత ఆలయములో ప్రతిష్ఠింపబడుట. లూకా 2:22.
4. సుమోయాను, అన్న యేసును చూచుట. లూకా 2:25,36.
5. జ్ఞానులు యేసును దర్శించుట. లూకా 2:1-12.
6. యేసేపు, మరియల యేసును తీసుకొని ఐగుప్తుకు పారిపోవుట. మత్తయి 2:13-15.
7. హేరోదు రెండు సంవత్సరములలోపు పిల్లలందరిని వధించుట. మత్తయి 2:16-18.
8. ఘనుడైన హేరోదు మరణించుట. మత్తయి 2:19.
9. యోసేపు మరియలు యేసును తీసుకొని ఐగుప్తు నుండి నజరేతుకు తిరిగివచ్చుట. మత్తయి 2:21-23.
10. యేసు 12 సంవత్సరముల ప్రాయములో యెరూష లేము దేవాలయమును దర్శించుట మరియు పస్కాను గురించి ప్రశ్నించుట. లూకా 2:41-50.
11. బాప్తిస్మమిచ్చు యోహాను యేసుకు మార్గము సరాళము చేయుటకు తన పరిచర్యను ప్రారంభించుట. లూకా 3:1-3.
12. యోహాను యేసుకు బాప్తిస్మమిచ్చుట. మత్తయి 3:13-17.
13. యేసు అపవాదిచేత 40 దినములు అరణ్యములో శోధింపబడుట. మత్తయి 10:1-4.
14. యేసు కొండపై ప్రసంగించుట. మత్తయి 5-7.
15. యేసు 12 మంది శిష్యులను ఎన్నుకొనుట. మత్తయి 10:1-4.
16. యేసు యెరూషలేము దేవాలయమును శుభ్రము చేయుట తన మొట్టమొదటి పస్కా పండుగను ఆచరించుట యోహాను 2:13-25.
17. బాప్తిస్మమిచ్చు యోహాను చంపబడుట. మత్తయి 14:1-12.
18. యేసు యూదుల పండుగకు వెళ్ళుట. యోహాను 5:9.
19. యేసు యొక్క రెండవ, మూడవ, పస్కాపండుగ యోహాను 6:4
20. యేసు పర్ణశాలల పండుగకు వెళ్ళుట. యోహాను 7:2,10.
21. యేసు ప్రతిష్ఠత పండుగకు వెళ్ళుట. యోహాను 10:22-39.
22. యేసు లాజరును బ్రతికించుట. యోహాను 11.
23. పేతురు యేసును "నీవు సజీవుడవగు దేవుని కుమారుడైన క్రీస్తువు అని ఒప్పుకొనుట మరియు యేసు సంఘమునకు వాగ్దానమిచ్చుట. మత్తయి 16.
24. యేసు రూపాంతరము పొందుట. మత్తయి 17.
25. యేసు యొక్క చివరి వారము. యోహాను 12:1-20,28.
26. పస్కాకు 6 రోజుల ముందుగా బేతనియకు వచ్చుట. కుష్ఠరోగియైన సీమోను, లాజరు, మరియ, మార్తలతో విందులో పాల్గొనుట. యోహాను 12:1-12.
27. యేసు విజయోత్సవములో యెరూషలేము లోనికి

వచ్చుట. ఆలయమును శుభ్రపరచుట. అంజూరపు. మత్తయి 21 మార్కు 11 చెట్టును శపించుట. లూకా 19 యోహాను 12.

28. మరునాడు యేసు తిరిగి యెరూషలేముకు వచ్చుట మార్కు 11:27.

29. పస్కాకు రెండు రోజుల ముందు బేతనియ మరియ యేసును అభిషేకించుట మత్తయి 26:1-13.

30. మేడపై గదిలో సంఘటనలు మత్తయి 26 మార్కు 14, లూకా 22 యోహాను 13,14.

31. గెత్సెమనే తోటలో యేసు దుఃఖపడుట. మత్తయి 26, మార్కు 14, ఇస్కరియోతు యూదా నమ్మకద్రోహము. లూకా 22, యోహాను 18.

32. యేసును శుక్రవారము వేకువనే సన్హెద్రిన్ సభ ఎదుట నిలువబెట్టబడుట లూకా 22:66-71.

33. యేసును మొదట పిలాతు యొద్దకు, మత్తయి 26-27, మార్కు తరువాత హేరోదు యొద్దకు తిరిగి శుక్రవారము 14,15 లూకా 22,23. ఉదయమున పిలాతు యొద్దకు తీసుకొని వచ్చుట యోహాను 18,19

34. యేసు ఉదయమున 9 గంటలకు మత్తయి 27:35 సిలువ వేయబడుట. మూడు గంటల చీకటి 15:24 లూకా 23:33 (12:00 - 3:00) యోహాను 19:18.

35. యేసు మధ్యాహ్నము మూడు గంటలకు మరణించుట లూకా 23:44-46.

36. దేవాలయపు తెర రెండుగా నడిమికి చినుగుట మత్తయి 27:51.

37. భూకంపము సంభవించుట. మత్తయి 27:51.

38. అనేకమంది పరిశుద్ధులు పునరుత్థానము పొందుట. మత్తయి 27:57-61.

39. యేసు పాతిపెట్టబడుట. మత్తయి 27:57-61.

40. యేసు ఆదివారము తెల్లవారు జామున. మత్తయి 28, మార్కు 16 పునరుత్థానమునొందుట. లూకా 24, యోహాను 20.

41. యేసు యొక్క పది మహిమాన్వితమైన. మత్తయి 28, మార్కు 16, ప్రత్యక్షతలు లూకా 24, యోహాను 20-21.

42. యేసు గొప్ప పనిని తన శిష్యులకు అప్పగించుట. మత్తయి 28:18-20.

43. యేసు పునరుత్థానము నొందిన 40 దినముల తరువాత పరలోకమునకు ఆరోహణమగుట. అపో.కార్య. 1:9-11.

44. పెంతెకొస్తు (యేసు పునరుత్థానము తరువాత 50 దినములకు). అపో.కా 2:1-13.

దేవుడు మిమ్మును దీవించును గాక!!!

## పాఠకులకు శుభవార్త

**'పరిశుద్ధత'** మాసపత్రిక ఇంటర్నెట్‌లో చదువుకొనే సౌకర్యము కల్పించామని తెలియజేయుటకు సంతోషిస్తున్నాము. వెబ్‌సైట్ పేరు **www.holinessmagazine.com.** ప్రస్తుతము మీరు 2014 సంచికలన్నీ డౌన్‌లోడ్ చేసు కొనవచ్చును. త్వరలో పాత సంచికలన్నీ ఇంటర్నెట్ నుండి డౌన్‌లోడ్ చేసుకొనే సౌకర్యం కల్పించటానికి ప్రయత్నిస్తాము. అంతేకాక శ్రీమతి మాధురి మరియన్‌గారు పాడిన **'పరిశుద్ధ గీతములు' (Holi Melodies)** ఎనిమిది సి.డి.ల పాటలు మరియు **క్రిస్మస్ పాటలు** వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయి. మీరు ఈ పాటలను వినవచ్చు, డౌన్‌లోడ్ చేసుకోవచ్చును. త్వరలో **'పరిశుద్ధ ప్రవాహిని'** టి.వి. కార్యక్రమములో ప్రసారమయ్యే ప్రసంగాల వీడియోలను కూడా ఈ వెబ్‌సైట్ ద్వారా అందుబాటులోకి తేవాలన్న ఆలోచన ఉంది. ప్రార్థించండి. విదేశాలలో ఉన్న మీ బంధువులకు, స్నేహితులుకు తెలియజేయండి. దేవుడు మిమ్ములను దీవించును గాక!

**- ఎడిటర్**

# బ్రతుకుట ఎవరి కొరకు?

ఫిలిప్పి 1:19-21 నా బ్రతుకు క్రీస్తు కొరకే. చని పోయిన క్రీస్తు కొరకే.

పౌలుగారి బ్రతుకుట క్రీస్తు కొరకే గలతి. 2:20-22

1. తన కొరకే బ్రతికిన ధనవంతుడు
   - లూకా 12:16-21
2. ఆస్థి కొరకే బ్రతికిన యోవ్వనస్తుడు
   - మార్కు 10:20-22
3. అధికారంకై బ్రతికిన రాజులు - దాని. 4:30-33
4. శరీరంకై బ్రతికిన సంసోను-న్యాయాధి. 13:15, 16:4
5. ప్రజలకై బ్రతికిన మోషే-నిర్గ 32:32, సంఖ్యా. 16:48
6. దేవుని కొరకై హతసాక్షులుగా మారిన శిష్యులు
7. సాక్షమిచ్చే దానికి బ్రతికిన సమరయ స్త్రీ
   - యోహా. 4:39, లూకా 2:37
8. సువార్త సేవకై బ్రతికిన పౌలుగారు - 1కొరి. 9:16
9. ప్రజల విమోచనకై బ్రతికిన క్రీస్తు
   - యెష. 53:6-8-12
10. దేవునినే ఘనపరచిన దానియేలు - దాని. 3:17
   - మన బ్రతికిన చనిపోయిన క్రీస్తు కొరకే. రోమా 14:7-8
   - ప్రజలు దేవుని కొరకే బ్రతకాలని దేవుని ఆశ మత్త. 6:33
   - మనము ఎవరికొరకు దేనికొరకు బ్రతుకు తున్నాము?
   - క్రీస్తు కొరకు బ్రతికితే నిత్యజీవము
   - క్రీస్తులేని బ్రతుకు నరకము ఆలోచించు బ్రతుకు మార్చుకొనుము.

**విశ్వాసము - కొలతలు**

- లూకా 17:5 మా విశ్వాసము అభివృద్ధి పర్చుము. విశ్వాసమునకు ప్రామాణికతలు.

1. త్వరగా లోబడుట:
   - వెంటనే వలలు విడిచిన పేతురు. మత్త. 4:20
   - సమయాన్ని కోరిన శాస్త్రి. మత్త. 8:21
2. వ్యక్తిగతంగా లోబడుట:
   - దేవుని మాటను ఆధారం చేసుకొని బ్రతికిన ప్రయాణమైన అబ్రహాము. ఆది. 12:1
   - మాటకు లోబడని లోతు భార్య. ఆది. 19:26
   - లోబడినట్టు నటించిన యూదా అపొ.కార్య. 1:17
3. నమ్మకస్తులుగా ఉండుట:
   - భళే మంచి దాసుడుగ మెప్పుపొందిన మత్త. 25:21
   - చెడ్డ దాసుడు. మత్త. 25:26
   - నమ్మకస్తులకై దేవుని కన్ను కని పెట్టుట. కీర్త 101:6
4. సంపూర్ణముగా లోబడుట :
   - నా బ్రతుకు క్రీస్తే. ఫిలి. 1:19-22
   - సమర్పించుకొనిన దానియేలు దాని. 3:18, 1:8
5. సంతోషంగా లోబడుట
   - జక్కయ్య లోబడుట విధానము. లూకా 19:6
   - అత్తరుతో పాదాలు కడిగిన స్త్రీ. లూకా 7:37
   - లోబడని పరిసయ్యులు. లూకా 19:1
6. ప్రార్థనా జీవితం :
   - దానియేలు ప్రార్థన. దాని. 6:9-10
   - వేషధారుల ప్రార్థన. మత్త. 6:5
   - ఎడతెగని ప్రార్థన. అపొ.కార్య 2:42



**పాఠకులకు, చందాదారులకు,**

**ప్రకటన కర్తలకు, శ్రేయోభిలాషులకు**

**నూతన సంవత్సర శుభాకాంక్షలు!!**

- ఎడిటర్ మరియు సిబ్బంది

**9వ పేజీ తరువాయి....**

థామస్‌గారిని వెతుకుతూ లోనికి వచ్చారు. దేవుడు చేసిన ఈ అద్భుతకార్యము చూచి దేవుని స్తుతింసాగారు. రాముపిళ్ళై థామస్‌గారి కాళ్ళపై పడి క్షమించమని ఏడ్వ సాగాడు. థామస్‌గారు ప్రేమతో అతనిని నిమిరి అందరి పాపాల్ని క్షమించడానికి యేసుప్రభువు ఈ లోకానికి వచ్చాడు అని అతనికి ధైర్యం చెప్పాడు. థామస్‌గారు తమ శిష్యులతో ఆ బూడిదను జాగ్రత్తగా తీసుకొని వెళ్ళి స్మశానంలో పాతిపెట్టమని చెప్పాడు. తెల్లవారిపోయింది చుట్టుప్రక్కల ఉదయాన్నే పనులు చేసుకునే వాళ్ళందరు పరిగెత్తుకుంటు వచ్చారు. రాముపిళ్ళై భార్య కౌసల్య నడుచుచు ఆయన వెంట రావడం చూచి ఆశ్చర్యపోయాడు. జరిగిన సంగతులు రాముపిళ్ళై ద్వారా విని విబ్రాంతి నొందారు. థామస్‌గారు శిష్యులు దేవుని స్తుతించుచు ప్రార్ధన కొండకు బయలుదేరారు.

చూశారా! బాలలు ఇది కట్టుకధకాదు జరిగిన సంగతిగా కేరళ ప్రాంతంలో చెప్పుకుంటు ఉండేవారంట. కనుక మంత్రాలు మాయలకన్నా దైవశక్తి చాలా గొప్పది. దేవుని దూతలు మీకు ఎల్లప్పుడు తోడుగా వుంటారు. ధైర్యంగా వుండండి దేవుడు మిమ్మల్ని దీవించునుగాక.

## బైబిల్ క్విజ్ - 5 జవాబులు

1. 42 తరములు
2. దేవుడు మనకు తోడు
3. బేత్లెహేము
4. తూర్పు దేశము నుండి
5. బంగారు, సాంబ్రాణి, బోళము
6. దావీదు వంశస్థుడు
7. కురేనియు
8. గలిలయలోని నజరేతు
9. పశువుల తొట్టిలో
10. పొలములో నుండి
11. రక్షకుడు
12. అభిషిక్తుడు
13. ఎనిమిది
14. సుమెయోను
15. అన్న
16. నజరేతు
17. పస్కా పండుగ
18 12 సంవత్సరాలు
19. మూడు దినములు
20. 30 ఏండ్లు

**19వ పేజీ తరువాయి....**

సిలువ ధ్వజము పైకెగిరెను. విశాఖపట్నం రేవు పట్టణం కావడం చేతను, గుంటూరు తెలుగు గడ్డకు, నడిబొడ్డు కావడంవలనను, క్రైస్తవసంఘ కార్యకలాపాలకు అవి కేంద్ర స్థానాలైనాయి. 19వ శతాబ్ధపు చివరి పాదములో సిలువ వార్త నలుమూలలకు వ్యాపించి తెలుగు దేశాన్ని పునీతం చేసినది. ఈనాడు భారతదేశంలో క్రైస్తవులు అధికముగాగల రాష్ట్రాలలో ఒకటిగా తెలుగుదేశం ప్రసిద్ధిపొందెను. ఈ ప్రసిద్ధి కేవలం సంఖ్యా బలములోనే గాక విద్య, వైద్య, రంగాలలో ముందంజవేసి, తెలుగు ప్రజలను చైతన్యవంతం చేసినది. ప్రభుత్వమింకా యోచింపకముందే పారిశ్రామిక వాడలను, అనాధ శరణాలయాలను ఉచిత విద్యా భోజన సౌకర్యాలతో సహా ఏర్పాటు చేసినది. నిమ్నజాతులైన రెండు వర్గాలను సువార్తద్వార పునరుద్దరించి వారు కూడ మానవులనే జ్ఞానోదయం వారినేగాక వారినా స్థితికి దిగజార్చిన వారిలో కూడ కలగాలని తీవ్ర ప్రయత్నాలు చేసి సమాజములో సమానస్థానము కల్పించినవి.



# అక్షరయజ్ఞం

**బైబిల్ క్విజ్ - 6**



**శ్రీమతి కె. ప్రసన్న పరాక్రమ్**

1. రాహేలు పెద్ద కుమారుని పేరేమి?
2. యాకోబు తన మామ లాబానుతో తనకు జీతముగా ఏమి కోరెను?
3. యాకోబు ఏ చెట్ల చువ్వలను వాటి తొక్కలు వొలిచి మందకు ఎదురుగా నీళ్ళలో పెట్టెను?
4. యాకోబు తన లాబాను యొద్దనుండి పారిపోవు నప్పుడు లాబాను ఎక్కడికి వెళ్ళెను?
5. లాబాను గృహ దేవతలను దొంగిలించినది ఎవరు?
6. లాబానురాహేలు గుడారములోనికి ప్రవేశించినప్పుడు రాహేలు ఏమి చేసెను?
7. లాబాను యాకోబు ప్రమాణము చేసికొన్న రాళ్ళ కుప్పకు ఏమని పేరు పెట్టెను?
8. ఏశావు ఏ దేశములో నివసించుచుండెను?
9. ఏశావు ఎంతమందితో యాకోబును ఎదుర్కొనుటకు బయలుదేరెను?
10. యాకోబు తన మంద అంతటిని ఎన్ని గుంపులుగా చేసెను?
11. దేవుడు యాకోబు పేరును ఏమని మార్చెను?
12. యాకోబు దేవుని చూచిన ప్రదేశమునకు ఏమని పేరు పెట్టెను?
13. రిబ్కా దాది పేరేమి?
14. దీనాను బలవంతముగా తీసుకెళ్ళిన వాని పేరు ఏమి?
15. షెకెములోని మనుష్యులను చంపిన యాకోబు కుమారులు ఎవరు?
16. యాకోబు ఏ ఊరు వెళ్ళి అక్కడ గుడారములు వేసెను?
17. రాహేలు చనిపోతూ తన రెండవ కుమారునికి ఏమని పేరు పెట్టెను?
18. యాకోబు తన రెండవ కుమారునికి ఏమని పేరు పెట్టెను?
19. యాకోబుకు మొత్తం ఎంతమంది పిల్లలు?
20. ఇస్సాకు జీవించిన సంవత్సరములు ఎన్ని?
21. యాకోబు తన కుమారులలో ఎవరిని ఎక్కువగా ప్రేమించెను?
22. యాకోబు తన కుమారుడైన యోసేపు కొరకు ఏమి చేసెను?
23. యోసేపు తన అన్నల గురించి ఏ సమాచారము తన తండ్రికి తెలియజేసేవాడు?
24. యోసేపు అన్నలు అతని మీద పగబట్టుటకు కారణమేమి?
25. యోసేపు తన అన్నల గురించి ఎన్ని కలలు కనెను?

**గమనిక :** ఈ ప్రశ్నలన్నిటికి సమాధానాలు బైబిలు నుండి గ్రహించవచ్చును. మీరు ఈ బైబిల్ క్విజ్‌లో పాల్గొనటం ద్వారా బైబిలు జ్ఞానమును సంపాదించాలన్నదే మా ఉద్దేశ్యం. కావున ప్రతి ఒక్కరూ ఈ బైబిల్ క్విజ్‌లో పాల్గొని బైబిలు జ్ఞానము సంపాదించటంతో పాటు బహుమతులు గెలుపొందవలసినదిగా కోరుచున్నాము.